సత్యసాయి సేవలే స్ఫూర్తి

సత్యసాయి గ్లోబల్ కౌన్సిల్ జోన్-4 కో ఆర్డినేటర్ గౌతమ్

ఆన్‌లైన్ ద్వారా నేపాల్‌లో నీటి ప్రాజెక్టు ప్రారంభం

మూడోరోజు సత్యసాయి సేవాదళ్ సదస్సులు



అలంకరణలో బాబా మహా సమాధి (వివరాలు 7లో..)

జగన్ కాన్వాయ్‌కి అద్దె వాహనాలు

దర్జాగా వాడి.. డబ్బివ్వలేదు



- కోవిడ్, సార్వత్రిక ఎన్నికలకూ వినియోగం
- అద్దె బకాయిలు రూ.70 లక్షలకు పైగానే..
- అధికారుల చుట్టూ వాహనదారుల ప్రదక్షిణ

గుంతకల్లు, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో నాటి సీఎం జగన్ పర్యటనలకు కాన్వాయ్ ఏర్పాటు చేసిన వాహనదారులు అద్దె బిల్లుల కోసం కళ్లకు కాయలుకాచేలా ఎదురుచూస్తున్నారు. సీఎం కాన్వాయ్‌తోపాటు ఎమ్మెల్సీ ఎన్నికలు, సార్వత్రిక ఎన్నికలకు వాహనాలను సమకూర్చారు. వాహనాల అద్దెతోపాటు డ్రైవర్ బత్తా సొమ్ము రాలేదు. కొవిడ్ సమయంలో రోగులను ఆసుపత్రులకు తీసుకెళ్లడానికి, మృతదేహాలను తరలించడానికి పలువురు వాహనాలను సమకూర్చారు. నాలుగేళ్లు గడిచినా వారికి బిల్లులు చెల్లించలేదు. సార్వత్రిక ఎన్నికల్లో రెవెన్యూ శాఖకు ఇచ్చిన వాహనాలకు పది రోజుల్లోనే డబ్బురాగా, పోలీసులకు ఇచ్చిన వాహనాలకు ఇప్పటికీ డబ్బు రాలేదు. దీంతో వాహనదారులు అధికారుల చుట్టూ తిరుగుతున్నారు.

రూ.70 లక్షలు పెండింగ్

నాటి సీఎం జగన్ పర్యటనకు అధికారులు ప్రైవేటు వాహనాలను అద్దెకు ఏర్పాటు చేశారు. రెండేళ్లపాటు జిల్లాలో రూ.25 లక్షల అద్దె చెల్లించలేదు. రెండేళ్ల క్రితం ఎమ్మెల్సీ ఎన్నికలకు సైతం వాహనాలను అద్దెకు తీసుకున్నారు. ఆ బిల్లులు, బత్తాలు రూ.6 లక్షల వరకూ బకాయి ఉన్నాయి. అప్పట్లో డీజిల్ మాత్రమే వేయించారు. కొవిడ్ సమయంలో ప్రభుత్వం ఆదేశాల మేరకు జిల్లాలో రోగులను ఇళ్ల వద్ద నుంచి ఆసుపత్రికి, ఆసుపత్రుల్లో మరణించినవారి మృతదేహాలను ఖననానికి తరలించడానికి వాహనాలను సమకూర్చారు. ఆ బిల్లులు భారీగా పెండింగ్ ఉన్నాయి. కొవిడ్ సమయంలో అద్దె ఎంత ఇస్తారో చెప్పకుండానే వాహనాలను తీసుకున్నారు. అధికారులు అర్ధరాత్రి చెప్పినా.. వెంటనే వాహనాలను సమకూర్చామని, కానీ పైసా చెల్లించలేదని ఓనర్ కం డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వైసీపీ హయాంలో చెల్లించాల్సిన వాహనాల అద్దె బకాయిలు జిల్లాలో దాదాపు రూ.70 లక్షలు ఉన్నాయని సమాచారం.

కాళ్లరిగేలా తిరిగినా..

ప్రభుత్వ అవసరాలకు నాలుగేళ్లపాటు వాహనాలు పెట్టినవారు బిల్లుల కోసం మోటారు వాహనాల కార్యాలయాల చుట్టూ, ఉన్నతాధికారుల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నారు. ట్యాక్సీ, ఫోర్ వీలర్ అసోసియేషన్ల ఆధ్వర్యంలో వాహనాల యజమానులు కలెక్టర్ గ్రీవెన్సులో పలుమార్లు వినతి పత్రాలను సమర్పించారు. గత నెలలో గుంతకల్లులో జరిగిన ఆర్డీవో గ్రీవెన్సుకు వచ్చిన కలెక్టర్‌ను కలిశారు. బిల్లులను చెల్లించాలని మొరపెట్టుకున్నారు. సార్వత్రిక ఎన్నికల సమయంలో తాడిపత్రిలో ఎన్నికల కమిషన్ భారీ స్థాయిలో వాహనాలను అద్దెకు వినియోగించింది. జిల్లా వ్యాప్తంగా ఒక్కో వాహనానికి రూ.7 వేల నుంచి రూ.8 వేలదాకా బిల్లులు రావాల్సి ఉంది.

వెంటనే చెల్లించాలి..



కొవిడ్ సమయంలో పెట్టిన వాహనాలకు సైతం బిల్లులు ఇంతవరకూ ఇవ్వలేదు. ఎప్పుడు పిలిచినా ఎదురు ప్రశ్నించకుండా వాహనాలను తెచ్చిపెట్టాం. ప్రాణాలకు తెగించి వాహనాలను నడిపాం. అయినా పైసా కూడా ఇవ్వలేదు. కనీసం ఎన్నికల బిల్లులను ప్రస్తుత ప్రభుత్వం వెంటనే చెల్లించాలి.

-బ్రహ్మయ్య, ట్యాక్సీ అసోసియేషన్ కార్యదర్శి, గుంతకల్లు

15 వాహనాలను సమకూర్చాం..



అప్పటి సీఎం జగన్ ఫిబ్రవరిలో జిల్లా పర్యటనకు వచ్చారు. రెండు రోజులపాటు 15 వాహనాలను సమకూర్చాము. తొమ్మిది నెలలైనా ఇంతవరకూ డబ్బివ్వలేదు. అధికారులు స్పందించి వెంటనే బిల్లులను చెల్లించాలి.

- లక్ష్మీనారాయణ, ఫోర్ వీలర్ ప్యాసింజర్ వెహికల్ అసోసియేషన్ అధ్యక్షుడు, ఉరవకొండ

వసతి వెలుగులు

రూ.1.35 కోట్లతో మౌలిక వసతులు

- భవనాలకు మరమ్మతులు.. రంగులు
- ఆవరణలో ఎల్‌ఈడీ వెలుగులు
- మారిన ఎస్సీ హాస్టళ్ల రూపురేఖలు
- హర్షం వ్యక్తంచేస్తున్న విద్యార్థినులు
- బీసీ హాస్టళ్ల బాగుకోసం కలెక్టర్‌కు నివేదిక

కూటమి ప్రభుత్వం ఏర్పడిన అతి కొద్ది సమయంలోనే సంక్షేమ హాస్టళ్లలో పరిస్థితులు బాగుపడ్డాయి. వైసీపీ హయాంలో నిధులు లేక ఇబ్బందులు ఎదుర్కొన్న పేద విద్యార్థులకు మేలు జరుగుతోంది. జిల్లాలో సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతున్న ఎస్సీ వసతి గృహాలను మొదటి విడత కింద ఎపింక చేశారు. పది ఎస్సీ వసతి గృహాలు, కురుగుంటలోని అంబేద్కర్ గురుకుల పాఠశాలలో మౌలిక వసతులను మెరుగుపరిచారు. కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ ప్రత్యేక చొరవ చూపించారు. ఎంపీడీఓలు, తహసీల్దార్లతో నివేదికలను తెప్పించుకుని ప్రభుత్వానికి పంపించారు. ప్రభుత్వ అనుమతితో రూ.1.35 కోట్లు వెచ్చించి.. హాస్టళ్లు, గురుకుల పాఠశాల రూపురేఖలను మార్చేశారు. ● ఆంధ్రజ్యోతి, అనంతపురం ప్రెస్‌క్లబ్



ఎస్సీ బాలికల ప్రీమెట్రిక్ నం-2 హాస్టల్‌లో రేకుల కింద విద్యార్థినులకు భోజనం ఏర్పాట్లు



అనంతపురంలోని ఎస్సీ బాలికల కళాశాల వసతి గృహంలో రేకులు, వాటర్ ట్యాంకు, గోడలకు రంగులు



పరిశుభ్రంగా తయారైన మరుగుదొడ్లు

ఎస్సీ వసతి గృహాల మరమ్మతులకు రూ.1.35 కోట్లు కేటాయించడం, అక్కడి పరిస్థితులు మెరుగుపడటంతో మిగిలిన సంక్షేమ హాస్టళ్లకూ త్వరలో మంచి జరుగుతుందని భావిస్తున్నారు. బీసీ, ఎస్టీ, మైనార్టీ వసతిగృహాల మరమ్మతులకు నిధులు వస్తాయని వార్డెన్ల ఆశలు పెట్టుకున్నారు. బీసీ సంక్షేమ శాఖ డీడీ కుష్బూ కొఠారీ బీసీ హాస్టళ్లలో సమస్యలపై

ఇక్కడా ఆశలు

వార్డెన్లు, ఏబీసీడబ్ల్యూఓల ద్వారా నివేదిక తెప్పించుకున్నారు. దాదాపు 55 బీసీ హాస్టల్స్ భవంతులకు మరమ్మతులు, మౌలిక వసతులు, సీసీ కెమెరాల ఏర్పాటు తదితర అంశాలకు అందులో చోటు కల్పించారు. ఇందులో 28 వసతి గృహాల భవనాలకు మరమ్మతులు, మౌలిక వసతులు, 27 వసతి గృహాలకు సీసీ కెమెరాలు అవసరమని గుర్తించారు. మొత్తంగా రూ.3.67 కోట్లు ఖర్చవుతుందని అంచనా వేసి.. నివేదికను కలెక్టర్‌కు పంపారు. ఆ ఫైలుకు ఆమోదముద్ర పడినట్లు సమాచారం. రెండో విడత బీసీ వసతి గృహాలను బాగు చేస్తారని భావిస్తున్నారు. ఎస్టీ, మైనార్టీ హాస్టళ్లను సైతం బాగు చేసే అవకాశం ఉంది.

ఇబ్బంది పడేవాళ్లం..



గతంలో హాస్టల్‌లో ఇబ్బందులు ఎదుర్కొన్నాం. వర్షం కురిసినప్పుడు రేకుల నుంచి నీరు కారేది. రాత్రిళ్లు నిద్రలేకుండా గడిపేవాళ్లం. కాస్త బాగున్న గదుల్లో సర్దుకుని పడుకునేవాళ్లం. బాత్ రూములు అధ్వానంగా ఉండేవి. ఇప్పుడు హాస్టల్ పైకప్పులకు రేకులు వేయించారు. బాత్‌రూమ్‌లు శుభ్రంగా ఉన్నాయి. రంగులు వేయించారు. ఆవరణలో ఎల్‌ఈడీ లైట్లు వేయించారు. చాలా ఆనందంగా ఉంది.

- చందన, డిగ్రీ విద్యార్థిని, ఆర్ట్స్ కళాశాల

కొత్తగా ఉంది...



ఇంతకుముందు హాస్టల్ పైకప్పు పెచ్చులు ఊడి పడిపోయేవి. ఎప్పుడు ఏం జరుగుతుందోనని భయపడేవాళ్లం. గోడలు శిథిలావస్థకు చేరడంతో ఆందోళనగా ఉండేది. అసౌకర్యంగా గడిపాము. లైట్లు లేక రాత్రివేళల్లో ఇబ్బందులు పడేవాళ్లం. ఇప్పుడు సమస్యలన్నీ పరిష్కారమయ్యాయి. హాస్టల్ గదులను రిపేరీ చేశారు. రంగులు వేయించారు. అంతా కొత్తగా ఉంది. స్టడీ రూమ్‌లకు రేకులు వేయించడంతో ఎలాంటి ఇబ్బందిలేకుండా చదువుకుంటున్నాం.

- జయసుధ, డిగ్రీ విద్యార్థిని, ఎస్ఎస్‌బీఎన్ కళాశాల

పిల్లలు ఆనందంగా ఉన్నారు..



హాస్టల్‌లో విద్యార్థులు ఆనందంగా ఉంటేనే మాకూ బాగుంటుంది. గతంలో సరైన వసతుల్లేక ఇబ్బందులు పడ్డాం. చేతినుంచి డబ్బులు పెట్టుకుని చిన్న చిన్న మరమ్మతులు చేయించాము. గదుల్లో పెచ్చులూడి పడుతుండటంతో బాలికలు ఇబ్బంది పడేవారు. ప్రస్తుతం సమస్యలన్నీ తీరిపోయాయి. హాస్టల్ భవంతి కొత్తగా మారిపోయింది. బాత్‌రూమ్‌లకు మరమ్మతులు చేశారు. ఆవరణమంతా రంగులు వేయడం, ఎల్‌ఈడీ లైట్లు, రేకులు వేయడంతో ఆహ్లాదకరంగా మారింది. విద్యార్థినులు ఆనందంగా గడుపుతున్నారు.

- వసంత, వార్డెన్, నంబర్-1 ఎస్సీ బాలికల కళాశాల వసతిగృహం,అనంతపురం

ఇబ్బంది పడేవారు..



సరైన వసతులు లేక హాస్టల్ పిల్లలు ఇబ్బందిపడేవారు. రెండు, మూడు గదుల పెచ్చులు ఊడిపడుతుండేవి. ఎన్నోసార్లు అధికారుల దృష్టికి తీసుకువెళ్లాము. పలుమార్లు సొంత డబ్బు ఖర్చు పెట్టి మరమ్మతు చేయించాము. కూటమి ప్రభుత్వం ఏర్పడి తరువాత పెచ్చు లూడుతున్న మూడు గదులకు మరమ్మతు చేశారు. విద్యార్థులకు అనువుగా హాస్టల్‌లో రేకులు వేశారు. వసతిపొందే మరో గదికి కొత్త రేకులు వేశారు. ఆవరణలో ఎల్‌ఈడీ లైట్లు వేశారు. బాత్‌రూములు రిపేరీ చేయించారు. హాస్టల్ భవంతికి రంగులు వేసి కొత్తగా మార్చారు. ప్రభుత్వానికి, కలెక్టర్, అధికారులకు రుణపడి ఉంటాం.

- అనిత, వార్డెన్, నంబర్-2 ఎస్సీ వసతి గృహం, అనంతపురం

పీడిత జన పక్షపాతి శకుంతలమ్మ

సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్.. ఘన నివాళులు అర్పించిన శ్రేణులు

అనంతపురం విద్య, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): సీపీఐ మహిళా సమాఖ్య నేత శకుంతలమ్మ పీడిత జన పక్షపాతి అని పార్టీ నాయకులు కొనియాడాడు. అనారోగ్యంతో తుదిశ్వాస విడిచిన ఆమెకు సీపీఐ శ్రేణులు బుధవారం ఘన నివాళి అర్పించాయి. ఆ తర్వాత వైద్య విద్యార్థుల పరిశోధనార్థం ఆమె పార్థివదేహాన్ని మెడికల్ కళాశాలకు అప్పగించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్, ఇతర నేతలు నివాళి అర్పించారు. సంఘమేష్ నగర్‌లోని ఆమె నివాసం నుంచి భర్త రుషేంద్రబాబు, కుమారుడు రాజేష్, కూతురు హిమబిందుతో కలసి సీపీఐ నాయకులు ఆమె భౌతిక కాయాన్ని మెడికల్ కళాశాలకు ర్యాలీగా తీసుకువెళ్లి అప్పగించారు. సీపీఐ, ఏఐటీయూసీ, మహిళా సమాఖ్యలో ఆమె 40 ఏళ్ల సేవలు అందించారని జాఫర్ గుర్తు చేసుకున్నారు. పీడిత ప్రజల కోసం అలుపెరగని పోరాటం చేశారని కొనియాడారు. కార్యకర్తలను ఆప్యాయంగా పలకరించే ఆమె భౌతికంగా లేకపోవడం బాధాకరమని అన్నారు. ఆమె సేవలు మరువలేనివని అన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు నారాయణస్వామి, రాజారెడ్డి, సంజీవులు, అమీనమ్మ, లింగమయ్య, శ్రీరాములు, రమణ, బద్రి స్వామి, కేశవరెడ్డి, సంతోష్‌కుమార్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



శకుంతలమ్మ అంతిమ యాత్రలో సీపీఐ నాయకులు

చట్టవ్యతిరేక పనులను కట్టడి చేయండి: ఎస్పీ

అనంతపురం క్రైం, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): మట్కా, పేకాట, గంజాయి, ఇసుక అక్రమ రవాణా తదితర చట్ట వ్యతిరేక కార్యకలాపాలను కట్టడి చేయాలని ఎస్పీ జగదీష్ పోలీసు అధికారులను ఆదేశించారు. పోలీస్ కాన్ఫరెన్స్ హాల్‌లో బుధవారం నెలవారీ నేర సమీక్ష నిర్వహించారు. సర్కిళ్ల వారిగా కేసుల వివరాలను తెలుసుకున్నారు. సీడీ ఫైల్స్‌ను పరిశీలించారు. రోడ్డు ప్రమాదాలను తగ్గించాలని, బ్లాక్‌స్పాట్‌లపై తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఫ్యాక్షన్ ప్రభావిత, సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. సైబర్ నేరగాళ్ల వలలో చిక్కుకోకుండా ప్రజల్లో అవగాహన పెంచాలని అన్నారు. సమీక్షలో ఏఎస్పీ రమణమూర్తి, డీఎస్పీలు శ్రీనివాసరావు, వెంకటేశ్వర్లు, రవిబాబు, రామకృష్ణుడు, మహబూబ్ బాషా, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.



ఫైరింగ్ ప్రాక్టీస్ చేస్తున్న ఎస్పీ

ఫైరింగ్ ప్రాక్టీస్

అనంతపురం రూరల్ మండలం మన్నీలలో బుధవారం నిర్వహించిన వార్షిక ఫైరింగ్ ప్రాక్టీస్‌లో ఎస్పీ జగదీష్ పాల్గొన్నారు. ఏకే 47, ఎస్ఎల్ఆర్, ఎల్ఎంజీ, ఇన్సాస్, పిస్టల్ ఫైరింగ్ సాధన చేశారు. ఏఎస్పీలు రమణమూర్తి, ఇలియాజ్ బాషా ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు, సిబ్బంది సాధన చేశారు. ప్రతి ఒక్కరూ ఫైరింగ్‌లో మెలకువలు నేర్చుకోవాలని, శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసుల సేవలు చాలా కీలకమని ఎస్పీ అన్నారు.

మార్కెట్ యార్డులు

ఏవీ?

బోర్డుకే పరిమితమైన శింగనమల

(వివరాలు 6లో..)

రైతన్న పరవశం..!

కృష్ణమ్మ పరవళ్లు.. పచ్చగా పంటలు.. గణనీయంగా పెరిగిన సాగు



హంద్రీనీవా కాలువలో ప్రవహిస్తున్న నీరు

ఉరవకొండ, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): హంద్రీనీవా కాలువకు కృష్ణా జలాలు పరవళ్లు తొక్కుతున్నాయి. నిత్యం వర్షాలపైనే ఆధారపడి పంట వస్తుందో రాదోనని బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీసిన రైతు ఆనందంతో పరవశించిపోతున్నాడు. హంద్రీనీవా కాలువ పరిధిలో పన్నెండేళ్లలో సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగింది. రైతులు కాలువలో నీటిని తరలించుకుని పంటలను సాగు చేస్తున్నారు. కాలువ సమీపంలో ఉన్న పంట పొలాలన్నీ కళకళలాడుతున్నాయి. ఉరవకొండ నియోజకవర్గంలోని వజ్రకరూరు, బెళుగుప్ప మండలాల్లో ఈ ఏడాది 30వేల ఎకరాలకు పైగా పంటలను సాగు చేశారు. కాలువ కింద ప్రధానంగా మిరప, కంది, వేరుశనగ, పప్పుశనగ పంటలు వేశారు. ఈ ఏడాది కాలువకు జూలై నెలలోనే నీరు విడుదల చేశారు. వర్షాలు సమృద్ధిగా కురవడంతో శ్రీశైలం డ్యాంలో కూడా నీరు పుష్కలంగా ఉంది. మార్చి దాకా నీరు వచ్చే అవకాశాలు ఉన్నాయి. కాలువ సమీపంలో ఉన్న రైతులు విద్యుత్ మోటార్లను ఏర్పాటు చేసుకుని నీటిని తరలించుకుంటున్నారు. కాలువ వెళ్లే గ్రామాల పరిధిలోని రైతులు ఐదారు కిలో మీటర్ల వరకూ పైపులైన్లు వేసుకున్నారు. వీటి ద్వారా నీటిని పొలాలకు వదులుకుని పంటలను సాగు చేస్తున్నారు. గత ప్రభుత్వ నిర్వాకం వల్ల రెండేళ్ల నుంచి కాలువ పరిధిలో పంటలు సరిగ్గా పండలేదు. గత ఏడాది పంటలు చేతికొచ్చే దశలో నీటిని నిలిపివేయడంతో రైతులతో పాటు అప్పటి ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ రోడ్డెక్కి ఆందోళనకు దిగారు.

రైతుల పక్షాన పోరాడి నీటి విడుదలకు కృషిచేశారు. ఈసారి కూటమి ప్రభుత్వం అధికారంలో ఉండడంతో పాటు, కృష్ణా జలాలను తరలించడంపై ప్రభుత్వం శ్రద్ధ చూపడంతో హంద్రీనీవా కాలువ ఆధునికరణకు శ్రీకారం చుట్టడంతో హంద్రీనీవా రైతులు ఆశలు పెట్టుకున్నారు. ఇప్పటికే 33వ ప్యాకేజీలో డీ1, డీ2 డిస్ట్రిబ్యూటర్లకు సాగునీటిని అందిస్తున్నారు. హంద్రీనీవా డిస్ట్రిబ్యూటరీ పనులు పూర్తయితే ఉరవకొండ నియోజకవర్గంలోనే 70వేల ఎకరాల ఆయకట్టు సాగులోనికి వస్తుంది.

కేశవ్ ప్రత్యేక చొరవ

హంద్రీనీవా కాలువకు 12 ఏళ్ల నుంచి నీరు పారుతోంది. డిస్ట్రిబ్యూటరీ పనులు పూర్తి కాకపోవడంతో అప్పటి ఎమ్మెల్యే, ప్రస్తుత మంత్రి పయ్యావుల కేశవ్ కాలువలో నీటిని తోడుకోవడానికి అధికారులను ఒప్పించారు. కేశవ్ చొరవతో నియోజకవర్గంలో హంద్రీనీవా కాలువ పరిధిలో గణనీయంగా సాగు విస్తీర్ణం పెరిగింది. ప్రక్క మండలాలకు చెందిన రైతులు కాలువ సమీపంలోని పొలాలను గుత్తకు తీసుకుని, విద్యుత్, డీజిల్ మోటార్ల ద్వారా నీటిని తోడుకుని పంటలను సాగు చేస్తున్నారు.



కాలువ సమీపంలో సాగుచేసిన మిరప పంట

కౌలుకు తీసుకుని సాగు చేశా



కౌలుకు తీసుకుని రెండేళ్ల నుంచి పంటలు సాగు చేస్తున్నా. కాలువ పరిధిలో పొలాలకు మంచి డిమాండ్ ఉంది. ఎకరాకు రూ.40వేల దాకా కౌలు చెల్లిస్తున్నాం. ప్రస్తుతం మిర్చి పంట సాగు చేశా. కాలువకు మార్చి దాకా నీళ్లు వస్తే, రెండు పంటలు పండించుకునే అవకాశముంటుంది.

- రాము, వేల్పుమడుగు

మూడు కిలోమీటర్లు పైపు లైన్ వేశా



హంద్రీనీవా కాలువ నుంచి మూడు కిలోమీటర్లు పైపు లైన్లు ఏర్పాటు చేసుకుని పంటలు సాగు చేస్తున్నా. ఏడేళ్ల క్రితం పైపులైన్ ఏర్పాటు చేశా. రూ.మూడు లక్షల దాకా ఖర్చు పెట్టా. ప్రతి యేటా కాలువ ద్వారా నీటిని తోడుకుని పంటలు పండిస్తున్నా. డిస్ట్రిబ్యూటరీ పనులు పూర్తి చేసి సాగు నీరు అందిస్తే బాగుంటుంది.

- వశికేరప్ప, రాగులపాడు

26న ధర్నాకు తరలిరండి

సీఐటీయు రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు

కళ్యాణదుర్గం, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): కేంద్రంలో అధికారంలో ఉన్న ఎన్డీయే ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు, కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 26న కలెక్టరేట్ వద్ద నిర్వహించనున్న ధర్నాకు తరలి రావాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు పిలుపునిచ్చారు. కళ్యాణదుర్గం పట్టణంలోని బాబూజగ్జీవన్‌రామ్ సర్కిల్ వద్ద నిర్వహించిన జీపు జాతాలో ఆయన మాట్లాడుతూ రైతులు పండించిన అన్ని పంటలకు మద్దతు ధర ప్రకటించాలని, విద్యుత్ సవరణ బిల్లు-2022ను రద్దు చేయాలని, వ్యవసాయ మోటార్లు, గృహ వినియోగానికి ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్లు ఆపాలని, రైతుల రుణమాఫీ చేయాలని, కార్మికులకు కనీస వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా


జీపుజాతాలో మాట్లాడుతున్న ఓబులు

కార్యదర్శి నాగేంద్రకుమార్, సహాయ కార్యదర్శి అచ్యుత్‌ప్రసాద్ ఇతర సంఘాల నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, శ్రీనివాసులు, శ్రీరామిరెడ్డి, వన్నూరుస్వామి, పాతక్క, రంగనాథ్, రఘు, నరేష్ పాల్గొన్నారు.

రైతు ఉత్పత్తులకు సొసైటీల సహకారం

జిల్లా సహకార శాఖాధికారి అరుణకుమారి

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): రైతులు పండించే పంట ఉత్పత్తులకు గిట్టుబాటు ధరలు కల్పించడం, సకాలంలో విక్రయిం చడానికి సహకార సొసైటీలు ఎంతగానో తోడ్పడుతున్నాయని జిల్లా సహకార శాఖ అధికారి (డీసీఓ) అరుణకుమారి పేర్కొన్నారు. 71వ అఖిల భారత సహకార వారోత్సవాల ముగింపు సభ బుధవారం స్థానిక రామ్‌నగర్ లోని రాయలసీమ సహకార శిక్షణా కేంద్రంలో నిర్వహించారు. 'స్థిరమైన అభి వృద్ధి లక్ష్యాల సాధనలో, మెరుగైన ప్రపంచ నిర్మాణంలో సహకార సంస్థల పాత్ర' అనే అంశంపై ఏర్పాటు చేసిన సదస్సును ఉద్దేశించి డీసీఓ మాట్లాడారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు చిన్నస్థాయి రైతులు, మత్స్యకారులు, ఉత్పత్తిదారులకు అవసరమైన మార్కెట్ సదుపాయం కల్పిస్తా యని అన్నారు. రైతులకు పంటల దిగుబడి పెంచడం, పెట్టుబడి తగ్గించడం,


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా సహకార శాఖాధికారి అరుణకుమారి

మౌళిక వసతులు కల్పించడంలో, ప్రజలకు ఆహారభద్రత పెంచడంలో సొసైటీలు కీలక పాత్ర పోషిస్తాయన్నారు. అర్బన్‌బ్యాంకు చైర్మన్ జేఎల్ మురళీధర్ మాట్లాడుతూ సహకార వ్యవస్థ ఆవిర్భావం తెలియజేస్తూ మార్పులు చేర్పులను వివరించారు. ప్రస్తుతం అర్బన్‌బ్యాంకు నాలుగు బ్రాంచ్‌లు ద్వారా సేవలు అందిస్తున్నామని, మరో ఆరు బ్రాంచ్‌ల ఏర్పాటుకు కసరత్తు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఆర్‌సీటీసీ ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, డీఎల్‌సీఓ ప్రభాకర్‌రెడ్డి, విశ్రాంత సీఈఓ నరసింహారెడ్డి, అసిస్టెంట్ రిజిస్ట్రార్లు నాగవీణ, మేథిని, సహకార విద్యాధికారి మురళీమోహన్ పాల్గొన్నారు.



బోర్డుకే పరిమితమైన శింగనమల మార్కెట్ యార్డు

మార్కెట్ యార్డులు ఏవీ..?

- బోర్డుకే పరిమితమైన శింగనమల
- స్థల కేటాయింపు లేని రాప్తాడు
- వైసీపీ హయాంలో ఆర్భాటంగా జీవోలు


నిధులు మంజూరు చేయాలి

శింగనమల మార్కెట్ యార్డుకు స్థలం కేటాయించారు. దిష్టిబొమ్మలాగా బోర్డు ఏర్పాటు చేశారు తప్ప ఎలాంటి అభివృద్ధి పనులు జరగలేదు. రైతుల అవసరాల దృష్ట్యా వెంటనే మార్కెట్ యార్డుకు నిధులు మంజూరు చేసే విధంగా ఎమ్మెల్యే చొరవ చూపాలి.

- నారాయణస్వామి, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి

బుక్కరాయసముద్రం, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గా నికి ఒక మార్కెట్ యార్డు అంటూ గత వైసీపీ ప్రభుత్వం చేసిన ఆర్భా టపు ప్రకటనలు కాగితాలకే పరిమితమయ్యాయి. తమ పార్టీ నాయ కులకు నామినేటెడ్ పదవులు పంపకం కోసమే అన్నట్లుగా తయార యింది. ప్రతి నియోజకవర్గంలో మార్కెట్ యార్డు ఏర్పాటు చేస్తు న్నట్లు జీవో జారీ చేసింది. రైతులు కూడా తాము పండించిన పంట లను సమీపంలోనే విక్రయించుకోవచ్చని ఆశించారు. కానీ ఎక్కడా వాటికి భవనాలు నిర్మించలేదు. అనంతపురం జిల్లాలో గతంలో అనం తపురం, కళ్యాణదుర్గం, రాయదుర్గం, తాడిపత్రి, గుంతకల్లు, గుత్తి, ఉరవకొండలో మార్కెట్ యార్డులు ఉండేవి. ప్రతి నియోజక వర్గానికి ఒక మార్కెట్ యార్డు ప్రకటనలో భాగంగా 2021లో వైసీపీ ప్రభుత్వం శింగనమల, రాప్తాడు నియోజక వర్గాలకు కమిటీలు ఏర్పాటు చేసింది. శింగనమల నియోజకవర్గం మార్కెట్ యార్డు కోసం బుక్క రాయసముద్రం మండలంలోని జంతులూరు వద్ద ఓపెన్ ఎయిర్ జైలుకు సంబంధించిన స్థలంలో 10 ఎకరాలు కేటాయించారు. బోర్డు పెట్టి భూమి పూజ చేసి వదిలేశారు. ఇప్పటి వరకు ఆ స్థలంలో ఒక్క ఇటుక పెళ్ల కూడా వేయలేదు. నూతన భవనాలు, గోడౌన్లు తదితర అభివృద్ధి పనులకు రూ.3.75 కోట్లతో అంచనాలు వేసి ఉన్నతాధికారు లకు నివేదిక పంపారు. 2021లో నివేదికలు పంపినా ఇంత వరకు నిధులు మంజూరు కాలేదు. రాప్తాడు నియోజకవర్గంలో మార్కెట్ యార్డు పేరుకే ఉంది. కనీసం స్థలం కూడా కేటాయించ లేదు. గతంలో రాప్తాడు, సీకేపల్లి మండలాల్లోని జాతీయ రహదారి పక్కన 10 ఎకరాలు స్థలం కోసం పలు చోట్ల చూశారు. ఎక్కడా అనువైన భూములు లేకపోవడంతో స్థల కేటాయింపు జరగలేదు. రాప్తాడు నియోజకవర్గంలో ఉన్న టమాటా మార్కెట్‌లో భారీ స్థాయిలో విక్ర యాలు జరుగుతున్నాయి. కక్కలపల్లి రహదారిలో ప్రైవేటు స్థలాల్లో మార్కెట్ ఏర్పాటు చేసుకుని క్రయవిక్రయాలు సాగిస్తున్నారు. పుట్ట పర్తి మార్కెట్ యార్డుకు స్థలం కేటాయించలేదు. కొత్తచెరువులో సబ్ మార్కెట్ యార్డుగా ఉన్న దానినే కొనసాగిస్తున్నారు. అదనంగా గోరంట్ల మార్కెట్ యార్డు కేటాయించారు.



యార్డు లేక తీవ్ర ఇబ్బందులు



శింగనమల నియోజకవర్గంలో మార్కెట్ యార్డు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. మార్కెట్ యార్డు ఏర్పాటు చేస్తున్నట్లు నాలుగు సంవత్సరాల క్రితం ప్రభుత్వం చెప్పింది. ఈ ప్రభుత్వ హయాం లోనయినా నిధులు మంజూరు చేసి భవనాలు, గోడౌన్ల నిర్మాణం చేపట్టాలి.

- గోపాల్‌నాయుడు, రైతు, జంతులూరు

భవన నిర్మాణాలకు అంచనాలు వేస్తున్నాం

శింగనమల మార్కెట్ యార్డు భవన నిర్మాణాలకు అంచనాలు వేస్తున్నాం. రూ.4.75 కోట్లతో అంచనాలు వేసినట్లు డీఈ, జేఈ తెలిపారు. త్వరలోనే ప్రభుత్వానికి నివేదిక పంపుతాం. నిధులు మంజూరుకాగానే పనులు ప్రారంభిస్తాం. రాప్తాడు నియోజకవర్గానికి ఇప్పటి వరకు స్థలం దొరకలేదు. ఈ విషయంపై స్థానిక ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లాం. యార్డుకు స్థలం దొరికిన వెంటనే అంచనాలతో ప్రభుత్వానికి నివేదిక పంపుతాం.

- సత్యనారాయణచౌదరి, ఏడీ, మార్కెట్ యార్డు

త్వరగా నిర్మాణం చేపట్టాలి

రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని నియోజకవర్గంలో వెంటనే మార్కెట్ యార్డు నిర్మాణం చేపట్టాలి. గతంలో వైసీపీ చేసిన నిర్లక్ష్యమే కూటమి ప్రభుత్వం చేస్తోంది. నిర్మాణం కోసం వెంటనే నిధులు మంజూరు చేయాలి. రైతుల సమస్యలను పరిష్కరించే దిశగా మంత్రులు, స్థానిక ఎమ్మెల్యే చొరవ చూపాలి.



- నల్లప్ప, సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు

రైతులకు రక్షణ కవచం పంటల బీమా

విస్తృతంగా అవగాహన కల్పించాలి: కలెక్టర్ వినోద్‌కుమార్


పంటల బీమా చేయండి.. రక్షణ కవచం పొందండి పోస్టర్లు ఆవిష్కరిస్తున్న కలెక్టర్

అనంతపురం అర్బన్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): రైతులకు పంటల బీమా రక్షణ కవచం లాంటిందని కలెక్టర్ వినోద్‌కుమార్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయంలో పంటల బీమాపై జిల్లా స్థాయి పర్యవేక్షణా కమిటీ (డీఎల్‌ఎంసీ) సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రబీ సీజన్‌కు సంబంధించి ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన పథకం, వాతావరణ ఆధారిత పంటల బీమా పథకాలపై రైతులకు సంపూర్ణ అవగాహన కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. తుఫాన్, కరువు, అకాల వర్షం తదితర ప్రకృతి వైపరీత్యాల మూలంగా పంట దిగుబడి నష్టపోతే ఆర్థికసాయం అందుతుందని వివరించారు. వాతావరణ ఆధారిత బీమాకు సంబంధించి మామిడి పంటకు ఎకరాకు రైతు వాటా రూ.1650 చెల్లిస్తే రూ.33వేల బీమాను వర్తింపజేస్తారన్నారు. టమోటా పంటకు ఎకరాకు రూ.1600 చెలిస్తే రూ.32వేల బీమాను వస్తుందన్నారు. ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన కింద దిగుబడి ఆధారిత బీమాకు వేరుశనగకు ఎకరాకు రూ.480 చెల్లిస్తే రూ.32వేల బీమా, జొన్నకు రూ.315 చెల్లిస్తే రూ.21వేలు, మొక్కజొన్నకు రూ.525 చెల్లిస్తే రూ.35వేలు, వరికి రూ.630 చెల్లిస్తే రూ.42వేలు, పప్పుశనగకు ఎకరాకు రూ.450 చెల్లిస్తే రూ.30వేల బీమా మొత్తాన్ని చెల్లిస్తారని వివరించారు. అనంతరం పంటల బీమా చేయండి.. రక్షణ కవచం పొందండి, ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన పోస్టర్లను కలెక్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో డీఆర్వో మలోల, జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ, సీపీఓ అశోక్‌కుమార్, డీహెచ్ఓ నరసింహారావు, డీపీఎం నాగరాజునాయుడు, ఎల్‌డీఎం నర్సింగరావు, ఎస్‌బీసీ డీఐఓ రవిశంకర్, అగ్రికల్చర్ ఇన్సూరెన్స్ కంపెనీ అధికారి దాసు, ఫ్యూచర్ జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ స్టేట్ ప్రెసిడెంట్ ప్రశాంత్, జిల్లా మేనేజర్ నరసింహమూర్తి, వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

పంటల్లో పండు ఈగ నివారణపై నేడు శిక్షణ

అనంతపురం అర్బన్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): ఉద్యాన పంటల్లో పండు పక్వానికి వచ్చే సమయంలో పంట దిగుబడిని తగ్గించే పండుఈగ నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై గురువారం శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఉద్యాన శాఖ జిల్లా అధికారి నరసింహారావు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉద్యాన శాఖ జిల్లా కార్యాలయంలో ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఉద్యాన పంటలను విదేశాలకు ఎగుమతి చేయడంపైనా చర్చిస్తామన్నారు. శిక్షణకు ఉమ్మడి జిల్లాకు చెందిన ఉద్యాన అధికారులు, రైతులు హాజరుకావాలని సూచించారు.

కార్యదర్శులు అప్‌డేట్ చేసుకోవాలి: డీపీఓ


సమావేశంలో మాట్లాడుతున్న డీపీఓ నాగరాజనాయుడు

అనంతపురం న్యూటౌన్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పంచాయతీ కార్యదర్శులు స్వర్ణ పంచాయతీ పోర్టల్లో తమ ప్రొఫైల్‌ను అప్‌డేట్ చేసుకోవాలని డీపీఓ నాగరాజనాయుడు ఆదేశించారు. బుధవారం డీపీఓ చాంబర్‌లో డీఎల్‌పీఓ సుమనజయంతితో కలిసి అనంతపురం రూరల్ మండలంలోని కార్యదర్శులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పలు శాఖాపరమైన అంశాలపై చర్చించారు. ఇంటి పన్నుకు సంబంధించి వందశాతం వసూళ్లు చేపట్టేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. జిల్లాలోని పంచాయతీ కార్యదర్శులందరికి సమాచారం చేరవేయాలని ఈఓఆర్డీలను ఆదేశించారు. సమావేశంలో ఈఓఆర్డీ వెంకటనాయుడు, కార్యదర్శులు అశోక్‌బాబు, శ్రీధర్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ కూలీ మృతి

అనంతపురం క్రైం, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ ఓ కూలీ మృతిచెందాడు. కక్కలపల్లి కాలనీకి చెందిన ఎర్రిస్వామి(43) అమరావతి సీడ్స్ దుకాణంలో పనిచేస్తున్నాడు. ఈనెల 16న టవర్‌క్లాక్ బ్రిడ్జిపై వెళ్తుండగా ఆటో ఢీకొంది. దీంతో తీవ్రగాయాలకు గురైన అతన్ని బెంగుళూరుకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ట్రాఫిక్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఎస్సీ, ఎస్టీ మహిళలకు స్వయం ఉపాధి

స్వయం సహాయక సంఘాల ద్వారా అమలు

ఎస్సీలకు 68, ఎస్టీలకు 863 యూనిట్లు మంజూరు

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ మహిళలకు స్వయం ఉపాధి పథకాలు అమలు చేయనున్నారు. స్వయం సహాయక సంఘాల ద్వారా ఈ కార్యక్రమాలు చేపట్టనున్నారు. కోడిపిల్లల పెంపకం ద్వారా ఎస్టీ మహిళలకు 863 యూనిట్లు, స్వయం ఉపాధి పథకం ద్వారా ఎస్సీ మహిళలకు 68 యూనిట్లు కేటాయించారు.

ఎస్టీ మహిళలకు 863 కోడిపిల్లల యూనిట్లు

స్వయం సహాయక సంఘాల్లో ఉండే ఎస్టీ మహిళలకు రాష్ట్ర ప్రభుత్వం కోడిపిల్లల పెంపకానికి జిల్లాకు 863 యూనిట్లు కేటాయించింది. యూనిట్ విలువ రూ.6వేలు కాగా ఇందులో ప్రభుత్వం రూ.3600 చెల్లించనుండగా, లబ్ధిదారులు రూ.2,400 చెల్లించాల్సి ఉంటుంది. కోడిపెట్టలు 11, కోడిపుంజులు 5 అందిస్తారు. 30 కిలోల దానా, మెడికల్ కిట్ అందజేస్తూ, రవాణా ఉచితంగా చేస్తారు. ఇప్పటికే ఈ పథకానికి సంబంధించి ఎస్టీ కార్పొరేషన్ ద్వారా డీఆర్‌డీఏ-వెలుగుకు రూ.45 లక్షల నిధులు కేటాయించారు.

ఎస్సీ మహిళలకు 68 యూనిట్లు

స్వయం సహాయ మహిళా సంఘాల్లో ఉండే ఎస్సీ మహిళలకు కేంద్రప్రభుత్వం ద్వారా ప్రధానమంత్రి అనుసుచిత్ జాతి అభ్యుదయ యోజన (పీఎంఏజేఏవై) ద్వారా జిల్లాకు 68 యూనిట్లు మంజూరు చేశారు. ఎంపిక చేసిన ఎస్సీ మహిళలకు రూ.లక్ష నుంచి రూ.3లక్షల వరకు బ్యాంకు ద్వారా రుణం అందజేస్తారు. ఉన్నతి కార్యక్రమంలో



భాగంగా జీవనోపాధుల పెంపునకు ఈ పథకాన్ని అమలు చేస్తారు. కేంద్రప్రభుత్వం 50 శాతం సబ్సిడీ, 10 శాతం లబ్ధిదారుల వాటా, 40 శాతం బ్యాంకు ద్వారా రుణం అందజేస్తారు. వ్యవసాయరంగం, స్వయం ఉపాధి, చిరు వ్యాపారం, కుటీర పరిశ్రమ ఏర్పాటుకు ఈ పథకం వర్తిస్తుంది.

అర్హులను గుర్తిస్తున్నాం



స్వయం సహాయక సంఘాల్లో ఉన్న ఎస్సీ, ఎస్టీ మహిళలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జీవనోపాధుల పెంపునకు పథకాలు అమలు చేస్తున్నారు. ఇందులో లబ్దిదారులను ఎంపిక చేయడానికి కసరత్తు చేస్తున్నాం. ఎస్టీ మహిళలకు జిల్లాకు 863యూనిట్లు కోడిపిల్లల పెంపకం చేపట్టనున్నాం. ఎస్సీ మహిళలకు 68 పీఎంఏజేఏవై యూనిట్లు జిల్లాకు కేటాయించారు. రెండు పథకాలు ఎస్సీ, ఎస్టీ మహిళల కుటుంబాల్లో వెలుగులు నింపనున్నాయి. **-ఈశ్వరయ్య, పీడీ, డీఆర్‌డీఏ-వెలుగు**

జనవరి 3 నుంచి ఎస్‌ఎస్‌బీఎన్ వార్షికోత్సవాలు

హాజరుకానున్న కేంద్ర, రాష్ట్రమంత్రులు

పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు రమేష్‌బాబు

అనంతపురం ప్రెస్‌క్లబ్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): శ్రీసాయిబాబు జాతీయ పాఠశాల, కళాశాలల (ఎస్‌ఎస్‌బీఎన్) 80వ వార్షికోత్సవాలను పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు శ్రీకారం చుట్టారు. కళాశాల ఆవరణంలో మూడ్రోజుల పాటు వేడుకలను నిర్వహించేందుకు సిద్ధమయ్యారు. ఈ కార్యక్రమానికి పాఠశాల, కళాశాలల్లో చదివి దేశ విదేశాల్లో ఉన్న పూర్వ విద్యార్థులు, ఐఏఎస్ అధికారులు, కేంద్ర, రాష్ట్ర మంత్రులకు ఆహ్వానం పలికేలా పూర్వ విద్యార్థుల కమిటీ సభ్యులు సన్నాహాలు చేస్తున్నారు. ఇందుకు సంబంధించి ఎస్‌ఎస్‌బీఎన్ విద్యాసంస్థల పూర్వ విద్యార్థుల సంఘం బుధవారం విలేకరుల సమావేశాన్ని నిర్వహించింది. సంఘం జిల్లా అధ్యక్షుడు పరుచూరి రమేష్‌బాబు మాట్లాడుతూ.. ఇక్కడ విద్యనభ్యసించిన విద్యార్థులు ఎంతో మంది కేంద్ర, రాష్ట్ర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లు, ఎస్పీలు, డీఎస్పీలుగా స్థిరపడ్డారన్నారు. ఈ నేపథ్యంలోనే ఆ పూర్వ విద్యార్థులతో పాటు... చదు


మాట్లాడుతున్న ఎస్‌ఎస్‌బీఎన్ విద్యాసంస్థల పూర్వ విద్యార్థుల కమిటీ సభ్యులు

వులు నేర్పించిన పూర్వ గురువులతో 80 వసంతోత్సవాల పేరిట ఆత్మీయ సమ్మేళనం నిర్వహిస్తున్నామని అన్నారు. జనవరి 3న పాఠశాల, 4న జూనియర్, 5న డిగ్రీ, పీజీ కళాశాలల ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహిస్తామని తెలిపారు. ప్రతిఒక్క విద్యార్థి ఎక్కడున్నా ఈ వేడుకల్లో పాల్గొనాలని కోరారు. సమావేశంలో సంఘం గౌరవాధ్యక్షుడు పీఎల్ఎన్ రెడ్డి, ఉపాధ్యక్షుడు ఎస్ఆర్ నాగభూషణం, కార్యదర్శి సుంకు వేణుగోపాల్, సహాయ కార్యదర్శులు శివచంద్ర, అన్నపూర్ణ, కోశాధికారి చంద్రశేఖర్ గుప్త, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

మహిళపై టీడీపీ నాయకుల దాడి

సోషల్ మీడియాలో వైరల్.. నలుగురిపై కేసు నమోదు

పుట్టపర్తి, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): కొత్తచెరువు లో మహిళపై టీడీపీ నాయకులు దాడిచేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కొత్తచెరువులోని నెహ్రూ కాలనీలో సిమెంటు రోడ్డు మంజూరైంది. కాలనీలోని నెమలి పార్వతమ్మ ఇంటి వద్ద రోడ్డు నిర్మాణానికి మెట్లు, డ్రైనేజీ గుంత అడ్డు వచ్చాయి. ఆక్రమణలు తొలగించుకోవాలని ఆమెకు అధికారులు సూచించారు. ఆమె ససేమిరా అనడంతో ఈనెల 19న టీడీపీ నేతలు వెళ్లి తొలగించుకోవాలన్నారు. అమె ససేమిరా అనడంతో టీడీపీ నాయకులు ఎక్స్‌కవేటర్‌తో తొలగించే పనులు చేపట్టారు. పార్వతమ్మ


మహిళపై దాడి చేస్తున్న టీడీపీ నాయకులు

అడ్డుకుంది. టీడీపీ నాయకులు.. ఆమెను పక్కకు నెట్టేసే క్రమంలో వాగ్వాదం తలెత్తింది. ఈ సందర్భంలో తనపైకే దాడి కొస్తావా అంటూ పార్వతమ్మను టీడీపీ నాయకులు కొట్టారు. ఈఘటనపై వైసీపీకి చెందిన మాజీ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి సోషల్ మీడియా వేదికగా బుధవారం పోస్టు పెట్టారు. అది వైరలైంది. తనపై టీడీపీ నాయకులు దాడి చేసినట్లు పార్వతమ్మ కొత్తచెరువు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో టీడీపీ నాయకుడు శ్రీనివాసులు, మరో ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు పుట్టపర్తి డీఎస్పీ విజయ్‌కుమార్ తెలిపారు. పార్వతమ్మపై టీడీపీ నాయకులు కూడా ఫిర్యాదు చేయనున్నట్లు తెలిసింది.

పేదలు ఇళ్లు కట్టుకోవాలి: కలెక్టర్


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

గుత్తి రూరల్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి ఆవాస్ యోజనలో జిల్లాను రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలపాలని అధికారులకు కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమారు సూచించారు. జక్కలచెరువులో బుధవారం లబ్ధిదారులకు అవగాహన కల్పించారు. సొంతిల్లు లేని ప్రతిఒక్కరూ ఇల్లు కట్టుకోవాలని సూచించారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గ్రామస్థులకు ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద 65 ఇళ్లు మంజూరయ్యాయని తెలిపారు. అందులో 30 పూర్తయ్యాయని, మిగిలినవారు నిర్మించుకోవాలని సూచించారు. ఒక్కొక్క ఇంటికి ప్రభుత్వం రూ.1.80 లక్షలు అందిస్తుందని తెలిపారు. అనంతరం గ్రామంలో నిర్మిస్తున్న ఇళ్లను పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్డీఓ శ్రీనివాసులు, హౌసింగ్ పీడీ శైలజ, ఎంపీపీ విశాలాక్షి, టీడీపీ నాయకులు ఈశ్వర్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

జాకీ పరిశ్రమను

మళ్లీ తీసుకురండి

అసెంబ్లీలో రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత

మంత్రులకు వినతిపత్రాలు


అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

అనంతపురం, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): రాప్తాడులో మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డి కమీషన్ల బెదిరింపులతో తరలిపోయిన జాకీ పరిశ్రమను తిరిగి అదే ప్రాంతంలో ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు బుధవారం అసెంబ్లీలో ప్రశ్నోత్తరాల సమయంలో ఆమె మాట్లాడుతూ... ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కృషితో జాకీ సంస్థ రాప్తాడు సమీపంలో పరిశ్రమను ఏర్పాటు చేసేందుకు ముందుకొచ్చిందన్నారు. 2017లో పరిశ్రమ ఏర్పాటు కోసం ఏపీఐఐసీ ద్వారా 27 ఎకరాల భూమిని కేటాయిస్తూ ఉత్తర్వులు ఇచ్చారని గుర్తు చేశారు. రూ.129 కోట్ల పెట్టుబడితో ఏడాదికి 32.4 మిలియన్ల దుస్తులను తయారు చేసే పరిశ్రమ పనులను 2018లోనే ప్రారంభించారని తెలిపారు. ప్రహరీ నిర్మాణం పూర్తి చేసి పరిశ్రమకు సంబంధించిన సామగ్రిని ఇక్కడికి తరలించే సమయంలో వైసీపీ అధికారంలోకి వచ్చిందన్నారు. ఆ సమయంలో అప్పటి ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డి, అతడి సోదరులు పరిశ్రమ యాజమాన్యం నుంచి రూ. 15 కోట్లు డిమాండ్ చేశారన్నారు. దీంతో పరిశ్రమ తెలంగాణకు తరలిపోయిందన్నారు. ఈ పరిశ్రమ ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా 10 వేల మందికి ఉపాధి కల్పించే అవకాశం కోల్పోయిందన్నారు. జాకీ పరిశ్రమను ప్రారంభించాలని టీడీపీతో పాటు సీపీఐ నాయకులు చలో జాకీ పరిశ్రమ కార్యక్రమాన్ని నిర్వహిస్తే.. ప్రకాశ్‌రెడ్డి ఆదేశాలతో 40 మంది నాయకులపై అక్రమంగా కేసులు పెట్టించారన్నారు. ఇందులో తనతో పాటు తన కుమారుడు పరిటాల శ్రీరామ్, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణలు ఉన్నారన్నారు. ఇతర గార్మెంట్స్ పరిశ్రమలు తీసుకొస్తామని ప్రగల్భాలు పలికిన నాటి ఎమ్మెల్యే ఏ ఒక్క పరిశ్రమను తీసుకురాలేదన్నారు. కూటమి ప్రభుత్వం గతంలో ఇచ్చిన ప్రోత్సహకాలు కొనసాగిస్తూ జాకీ పరిశ్రమను తిరిగి వచ్చేలా చూడాలన్నారు. అనంతరం స్పీకర్ అయ్యన్నపాత్రుడు చాంబర్లో ఎమ్మెల్యే పరిటాల సునీత, ధర్మవరం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్‌లు భారీ, చిన్న తరహా పరిశ్రమల శాఖల మంత్రులు టీజీ భరత్, కొండపల్లి శ్రీనివాస్‌ను కలిశారు. జాకీ పరిశ్రమను తిరిగి తీసుకురావాలని వినతిపత్రం అందజేశారు. ఈ విషయంపై మంత్రులు స్పందిస్తూ ముఖ్యమంత్రికి దృష్టికి తీసుకెళ్లి పరిశ్రమల స్థాపనకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

జాతీయ బాల్ బ్యాడ్మింటన్


పోటీలకు ఎంపిక

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఉమ్మడి జిల్లా క్రీడాకారులు ఎంపికైనట్లు జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు గౌస్‌మెహిద్దీన్, వెంకటేశులు, గౌరవాధ్యక్షుడు ఈశ్వరయ్య తెలిపారు. కళ్యాణదుర్గం మండలం నారాయణపురం గ్రామానికి చెందిన టి.అనిల్ ఆర్ట్స్ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతూ బాల్ బ్యాడ్మింటన్‌లో రాణిస్తున్నాడు. ఇటీవల నంద్యాలలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో మెరుగైన ప్రతిభతో మహారాష్ట్రలో నిర్వహించే జాతీయ పోటీలకు అర్హత సాధించాడు. అదేవిధంగా ధర్మవరానికి చెందిన పావని జాతీయ పోటీలకు ఎంపికయ్యారు. ఇదివరకే రాజశేఖర్, శ్రీనాథ్ జాతీయ పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. జిల్లా నుంచి ఈ ఏడాదిలో నలుగురు క్రీడాకారులు జాతీయ పోటీలకు అర్హత సాధించడం శుభసూచికమని వారు అభినందనలు తెలిపారు.


అనిల్


పావని

వచ్చే నెలలో సాగునీటి సంఘాల ఎన్నికలు


ఎన్నికల నిర్వహణపై అవగాహన కల్పిస్తున్న మాస్టర్ ట్రైనర్లు

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): సాగునీటి సంఘాలకు డిసెంబరు మొదటి వారంలో ఎన్నికలు నిర్వహించనున్నట్లు హెచ్చెల్సీ మైనర్ ఇరిగేషన్ ఎస్ఈలు రాజశేఖర్, విశ్వనాథ్‌రెడ్డి తెలిపారు. సాగునీటి సంఘాల ఎన్నికలపై బుధవారం సాయంత్రం స్థానిక జడ్పీలోని డీపీఆర్సీ భవనంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలో మైనర్ ఇరిగేషన్ పరిధిలో 95, హెచ్చెల్సీ పరిధిలో 54 సాగునీటి సంఘాలు ఉన్నట్లు తెలిపారు. ఇప్పటికే ఆయా సాగునీటి సంఘాల పరిధిలోని ఆయకట్టు రైతుల ఓటర్ల జాబితాలను ఆయా మండలాలు, గ్రామ పంచాయతీ పరిధిలో ప్రదర్శించామని తెలిపారు. ఇప్పటికే అభ్యంతరాలు కూడా అందజేశారని, అందుకు అనుగుణంగా మార్పులు, చేర్పులు చేశామన్నారు. డిసెంబరు మొదటి వారంలో నిర్వహించే ఎన్నికలకు సంబంధించి ఏర్పాట్లు, నిర్వహణ ప్రక్రియపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్లు వెంకటరమణారెడ్డి, రాజ్‌కుమార్, ఇంజనీర్లు, ఎన్నికల అధికారులు, సహాయాధికారులు, పోలింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

క్రైంకార్నర్

అప్పులబాధతో చేనేత కార్మికుడి ఆత్మహత్య


ఆదినారాయణ (ఫైల్)

పరిగి, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): అప్పుల ఉరికి మరో నేతన్న వేలాడాడు. మండలంలోని పెద్దరెడ్డిపల్లికి చెందిన చేనేత కార్మికుడు ఆదినారాయణ(44) అప్పుల బాధ భరించలేక బుధవారం తెల్లవారుజామున ఇంట్లోనే ఉరేసుకుని, మరణించాడు. జమేదార్ శ్రీనివాసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఆదినారాయణ కూలి మగ్గం పనులకు వెళ్తుండేవాడు. పనులు లేక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదురయ్యాయి. కుటుంబ పోషణకు కొంతమేర అప్పులు చేశాడు. ఇద్దరు కుమార్తెలకు మరింత చేశాడు. దీంతో మొత్తం అప్పు రూ.8లక్షలు దాటింది. దానిని ఎలా తీర్చాలోనని ఆవేదన చెందుతుండేవాడు. ఈ నేపథ్యంలో తీవ్ర మనస్తాపం చెందిన అతడు బుధవారం తెల్లవారుజామున తన ఇంట్లోనే ఉరేసుకున్నాడు. కాసేపటికి గమనించిన కుటుంబీకులు అతడిని కిందకు దించారు. అప్పటికే అతడు మరణించాడు. ఆదినారాయణ భార్య ఈశ్వరమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి, మృతదేహాన్ని హిందూపురం ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు జమేదార్ శ్రీనివాసులు తెలిపారు. ఆదినారాయణకు ఇద్దరు కుమార్తెలు, 9వ తరగతి చదువుతున్న కుమారుడు ఉన్నారు.

భార్య హత్యకేసులో భర్తకు జీవిత ఖైదు

అనంతపురం క్రైం/గుంతకల్లు టౌన్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): భార్యను వరకట్న వేధింపులకు గురి చేయడంతో పాటు ఆమెను హత్య చేసిన కేసులో సుబ్రహ్మణ్యం నాయక్ అనే వ్యక్తికి జీవిత ఖైదు శిక్ష ఖరారయింది. ఈ మేరకు బుధవారం అనంతపురం అడిషనల్ ఫోర్త్ సెషన్స్ మహిళా కోర్టు న్యాయాధికారి శోభారాణి తీర్పును వెల్లడించారు. గుంతకల్లు పట్టణం అరవిందనగర్‌కు చెందిన సుబ్రహ్మణ్యం నాయక్‌కు కదిరి మండలం రాచువారిపల్లికి చెందిన అఖిలతో 2021లో వివాహమైంది. వివాహ సమయంలో 10 తులాల బంగారం ఇచ్చారు. కొంత కాలానికే రూ.10 లక్షలు అదనపు కట్నం, ఒకటిన్నర ఎకరం పొలం తన పేరుతో రాయించాలని, లేకపోతే చంపేస్తానని భర్త ఆమెను తరచూ వేధించేవాడు. టిక్ టాక్ వీడియోలు చేస్తోందని అనుమానంతో హింసించేవాడు. ఈ క్రమంలో 2022 ఏప్రిల్ 1న సుబ్రహ్మణ్యం నాయక్ అఖిలపై విచక్షణారహితంగా దాడి చేసి గొంతు కోసి హత్య చేశాడు. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు అదే ఏడాది ఏప్రిల్ 1న గుంతకల్లు వన్‌టౌన్ అప్పటి సీఐ నాగశేఖర్ కేసు నమోదు చేశారు. అనంతరం సీఐ రామసుబ్బయ్య దర్యాప్తు కొనసాగించారు. పూర్తి వివరాలతో అడిషనల్ ఫోర్త్ సెషన్స్ మహిళా కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. 13 మంది సాక్షులను విచారించిన న్యాయాధికారి శోభారాణి నేరం రుజువు కావడంతో ముద్దాయికి జీవిత ఖైదు జైలు శిక్ష, రూ.15వేల జరిమానా విధించారు. కోర్టు మానిటరింగ్ సిస్టమ్ సీఐ వెంకటేష్ నాయక్, కోర్టు లైజనింగ్ ఆఫీసర్ ఏఎస్ఐ శ్రీనివాసులు, హెచ్‌సీ సొరెడ్డి, కానిస్టేబుల్ నాగేంద్రయ్య సాక్షులను సకాలంలో హాజరు పరిచారు. వారిని జిల్లా ఎస్పీ జగదీష్ అభినందించారు.

దొంగకు జైలు శిక్ష


అనంతపురం క్రైం, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): చోరీకి పాల్పడిన ఓ దొంగకు 10 నెలల జైలు శిక్ష పడింది. ఈ ఏడాది మే 18న రాత్రి గుంతకల్లు పట్టణానికి చెందిన చాకలి నారాయణ తన కుటుంబ సభ్యులతో కలిసి పక్క ఇంట్లో నిద్రించాడు. నల్లబోతుల వాసు అనే వ్యక్తి నారాయణ ఇంట్లోకి చొరబడి రూ.68వేల విలువైన జత బంగారు కమ్మలు, మూడు జతల వెండి కాళ్ల పట్టీలు, సామ్‌సంగ్ టీవీ, చిన్న పిల్లల బట్టలు దొంగలించాడు. ఈ కేసులో మొబైల్ న్యాయాధికారి సుజిన్ ముద్దాయికి 10 నెలల జైలు శిక్ష విధిస్తూ బుధవారం తీర్పు ప్రకటించారు.

యువకుడి ఆత్మహత్య


అనంతపురం క్రైం, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): అన్నా, వదినలు వేరు కాపురం పెట్టడానికి తనే కారణమంటున్నారని మనస్తాపంతో ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అనంతపురంలోని భవానీనగర్‌కు చెందిన దుర్గప్పకు ఇద్దరు కుమారులు దేవరకొండ చంద్రశేఖర్, కార్తీక్ ఉన్నారు. కార్తీక్ (24) ఇంటర్ వరకు చదివి ఇంటి వద్దే ఉంటున్నాడు. అన్న, వదినలు వేరు కాపురం పెట్టారు. వారు వేరు కాపురం పెట్టడానికి తమ్ముడే కారణమని చుట్టుపక్కల వారు అంటున్నట్లు విన్నాడు. దీనికి తోడు గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. దీంతో మనస్తాపానికి గురై ఉరి వేసుకుని మృతి చెందాడు. వన్‌టౌన్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి అదృశ్యం

అనంతపురం క్రైం, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): ఆస్తి పంపకాల విషయంలో ఓ వ్యక్తి అలక వహించి ఇంటి నుంచి అదృశ్యమయ్యాడు. నగర శివారులోని ఏఎస్ఆర్ నగర్‌కు చెందిన నజీర్ సోదరుల మధ్య ఆస్తి వివాదం నెలకొంది. ఈ క్రమంలో బుధవారం ఇంటి నుంచి అదృశ్యమయ్యాడు. భార్య షేకుం నాలుగో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు.



సత్యసాయి మహాసమాధి


ఆన్‌లైన్ ద్వారా నేపాల్‌లో నీటిపథకాన్ని ప్రారంభిస్తున్న రత్నాకర్


భక్తిపాటలు ఆలపిస్తున్న నేపాల్ భక్తులు

సత్యసాయి సేవలే స్ఫూర్తి


నారాయణ సేవ స్వీకరిస్తున్న భక్తులు


వేడుకల్లో పాల్గొన్న భక్తులు

- సత్యసాయి గ్లోబల్ కౌన్సిల్ జోన్-4 కో ఆర్డినేటర్
- ఆన్‌లైన్ ద్వారా నేపాల్‌లో నీటి ప్రాజెక్టు ప్రారంభం
- మూడోరోజు సత్యసాయి సేవాదళ్ సదస్సులు
- భక్తులను అలరించిన వేణునాదం

పుట్టపర్తి, నవంబరు20(ఆంధ్రజ్యోతి): సత్యసాయి బాబా సేవలే స్ఫూర్తి అని సత్యసాయి గ్లోబల్ కౌన్సిల్ జోన్-4 కోఆర్డినేటర్ డాక్టర్ నారాయణ బహదూర్ గౌతమ్ పేర్కొన్నారు. సత్యసాయిబాబా జయంత్యుత్సవాల మూడోరోజు బుధవారం స్థానిక ప్రశాంతి నిలయంలోని సాయికుల్వంత్‌లో సత్యసాయి సేవాదళ్ సదస్సులు నిర్వహించారు. నేపాల్‌కు చెందిన సత్యసాయి సేవాసంస్థ ఆధ్వర్యంలో చేపట్టిన నీటి పథకాన్ని ప్రశాంతి నిలయంనుంచి సత్యసాయి సెంట్రల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్జే రత్నాకర్ ఆన్‌లైన్ ద్వారా ప్రారంభించారు. నేపాల్‌లో చేపట్టిన సేవా కార్యక్రమాలను ఆ దేశానికి చెందిన డాక్టర్ నారాయణ బహదూర్ గౌతమ్ వివరించారు. గతేడాది శ్రీసత్యసాయి గ్లోబల్ కౌన్సిల్ చైర్మన్ చక్రవర్తి నీటి పథకానికి భూమిపూజ చేశారన్నారు. ప్రస్తుతం ఆ ప్రాజెక్టును రత్నాకర్ ప్రారంభించడం ఆనందదాయకమన్నారు. దేశంలో మారుమూల గ్రామాలు, కొండ ప్రాంతాల ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించడానికి 8 కమ్యూనిటీ డ్రింకింగ్ ప్రాజెక్టులు నిర్మించామన్నారు. మూడు కిలోమీటర్లు పైపులైన్ వేసి రెండు వేల గృహాలకు తాగునీరు అందించామన్నారు. వీటితోపాటు పాఠశాలల్లో సైతం తాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టామన్నారు. సత్యసాయి చూపిన బాటలోనే సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని ఆయన వివరించారు. అనంతరం నేపాల్ యువత భక్తిగీతాలు ఆలపించారు. సాయంత్రం జేఏ జయంత్ బృందం వేణునాదంతో భక్తులను మైమరపింపజేసింది. సేవా కార్యక్రమల్లో చురుగ్గా పాల్గొన్న నేపాల్ యువతకు ఆర్జే రత్నాకర్ ప్రసంసాపత్రాలు అదించి, అభినందించారు.

నారాయణ సేవకు క్యూకట్టిన భక్తులు

సత్యసాయి జయంతి వేడుకల్లో పాల్గొనే భక్తులకు ట్రస్టు ఆధ్వర్యంలో నారాయణసేవ చేపట్టారు. బుధవారం దాదాపు ఐదువేల మంది భక్తులు నారాయణ సేవ స్వీకరించారు. ప్రశాంతి నియలంలోని సాయి కుల్వంత్ మందిరంతోపాటు యజుర్‌మందిరం, గోపురం, గణేష్‌గేటు ప్రాంతాల్లో ప్రత్యేక దీపాలంకరణ చేశారు. వేడుకల్లో దేశ,విదేశాలకు చెందిన వేలాదిమంది భక్తులు పాల్గొన్నారు.

నేడు సేవాసంస్థల సదస్సులు

సత్యసాయి జయంతి వేడుకల నాలుగోరోజు గురువారం ప్రశాంతి నిలయంలోని సాయికుల్వంత్ సభామండపంలో శ్రీసత్యసాయి సేవాసంస్థల సదస్సులు నిర్వహించనున్నారు. సేవా కార్యక్రమాలపై చర్చిస్తారు. సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు.


విద్యుద్దీపాలంకరణలో సాయికుల్వంత్

ప్రగతి బాట..!

జిల్లాకు పరిశ్రమలొచ్చేస్తున్నాయ్..

కూటమి ప్రభుత్వం ఏర్పాటుతో పూర్వవైభవం

మడకశిరకు మందుగుండు తయారీ సంస్థ

భూముల కేటాయింపునకు కేబినెట్ ఆమోదం



ఆర్.అనంతపురం పారిశ్రామిక వాడ

పుట్టపర్తి/మడకశిర, నవంబరు20(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఏర్పాటుతో జిల్లాకు పరిశ్రమలు వచ్చేస్తున్నాయ్. పారిశ్రామిక రంగానికి పూర్వవైభవం వస్తోంది. జిల్లాలో పారిశ్రామిక, వ్యవసాయ రంగాలతోపాటు రహదారుల అభివృద్ధి, అనుసంధానం, ఎయిర్ కనెక్టివిటీ పెంచేందుకు శరవేగంగా అడుగులు పడుతున్నాయి. జిల్లాలో వెనుకబడిన మడకశిర ప్రాంతానికి పారిశ్రామిక మహర్దశ పట్టనుంది. తాజాగా నియోజకవర్గంలో మందుగుండు సామగ్రి తయారీ పరిశ్రమకు భూములు కేటాయించేందుకు రాష్ట్ర మంత్రిమండలి బుధవారం ఆమోదం తెలిపింది. చంద్రబాబు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టాక ఇటీవల తొలి ఢిల్లీ పర్యటనలోనే జిల్లాలకు జాతీయ రహదారుల అనుసంధానం, విస్తరణతోపాటు జాతీయ రహదారుల వెంట పారిశ్రామిక కారిడార్‌కు ప్రోత్సాహకాలు, అభివృద్ధికి బాటలు పడ్డాయి. పెట్టుబడులను ఆకర్షించే లక్ష్యంగా అమెరికాలో మంత్రి నారా లోకేశ్ ఇటీవల పర్యటించారు. ఈ సందర్భంగా విద్యుత్ వాహనా(ఈవీ)ల బ్యాటరీ తయారీ పరిశ్రమను అనంత జిల్లాలో ఏర్పాటు చేయాలని దిగ్గజ సంస్థ టెస్లాను కోరారు. దీంతో అందరి చూపు శ్రీసత్యసాయి జిల్లా వైపు మళ్లింది. తాజాగా ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన బుధవారం సచివాలయంలో నిర్వహించిన రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక మండలి సమావేశంలో మడకశిరలో మందుగుండు సామగ్రి తయారీ పరిశ్రమ ఏర్పాటుకు నిర్ణయం తీసుకోవడంతో జిల్లా ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మందుగుండు తయారీ పరిశ్రమకు భూములు

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆగస్టులో మడకశిర ప్రాంతంలో పర్యటించారు. సాగు, తాగునీటి సమస్య పష్కరించడంతో పాటు పారిశ్రామికంగా అభివృద్ధి చేసి లక్షల మందికి ఉపాధి కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఇప్పటికే మడకశిర మండలం బుల్లసముంద్రం, హరేసముంద్రం, మనూరు, కల్లుమర్రి గ్రామాల పరిధిలో 10 వేల ఎకరాల్లో సోలార్ పార్క్ ఏర్పాటుకు ఔత్సాహికులు ముందుకొచ్చారు. ముఖ్యమంత్రి చంద్రబాబు హామీ ఇచ్చిన మూడు నెలలు పూర్తికాకనే మడకశిర ప్రాంతంలో ఏపీఐఐసీ సేకరించిన భూముల్లో మందుగుండు సామగ్రి తయారీ పరిశ్రమ ఏర్పాటుకు అడుగులు పడుతున్నాయి. 2012లో ప్రత్యేక ఆర్థిక మండలి (సెజ్) ఏర్పాటు ద్వారా పరిశ్రమలు నెలకొల్పడానికి భూములు సేకరించారు. గౌడనహళ్లి, ఆర్ అనంతపురం, చత్రం గ్రామాల పరిధిలో 1600 ఎకరాలు గుర్తించారు. 2022లో సెజ్‌కు సంబంధించి 1443 ఎకరాల భూములను సేకరించారు. మడకశిర మండలం సి.కొడిగేపల్లి, కేతేపల్లి వద్ద 2006లో 1230 ఎకరాల భూమిని సేకరించారు. ఇలా మడకశిర నియోజకవర్గంలో పరిశ్రమల ఏర్పాటుకు 3043 ఎకరాల భూములను సిద్ధం చేశారు. గత వైసీపీ హయాంలో ఒక్క పరిశ్రమ కూడా ఏర్పాటు చేయలేదు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఐదు నెలల్లోనే పరిశ్రమల ఏర్పాటుకు ఆమోదముద్ర పడింది. భారత్ ఫోర్జ్ అనుబంధ సంస్థ కల్యాణీ స్ట్రాటిజిక్ సిస్టం లిమిటెడ్ (కేఎస్ఎస్ఎల్) రక్షణ రంగానికి అవసరమైన ఫిరంగుల మందుగుండు సామగ్రి పరిశ్రమకు భూములు కేటాయించారు. మొదటి దశలో రూ.1430 కోట్ల పెట్టుబడి పెట్టనుంది. 565 మందికి ఉపాధి లభించనుంది. దీంతో ఈప్రాంత ప్రజల్లో ఉపాధి అవకాశాలపై ఆశలు రేగుతున్నాయి.

జిల్లా వైపు ఔత్సాహికుల చూపు

జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు అనువైన భూములను 2014-19 మధ్య గత టీడీపీ హయాంలో గుర్తించారు. పెనుకొండ, పాలసముంద్రం, కప్పలబండ, హిందూపురం, మడకశిర మండలం రాళ్లఅనంతపురం, గోళ్లాపురం, గుడిపల్లి, దాదులూరు, శెట్టిపల్లి, సడ్లపల్లి, కొటిపి, కేతిగానిచెరువు, కుటాగూళ్ల వద్ద 10వేల ఎకరాలకుపైగా ఏపీఐఐసీ సేకరించింది. పెనుకొండ మండలం అమ్మవారుపల్లి, కప్పలబండ, కొటిపి, గోళ్లాపురం, గుడిపల్లి వద్ద ఎంఎస్ఎంఈలను ఏర్పాటు చేశారు. పెనుకొండ, మడకశిర, పుట్టపర్తి, కదిరి, హిందూపురం, ధర్మవరం, రాప్తాడు నియోజకవర్గాల్లో భూములు సేకరించే పనిలో ఏపీఐఐసీ నిమగ్నమైంది. నీరు, భూముల లభ్యత, జిల్లాలో గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్‌వే నిర్మాణం, హైదరాబాద్-బెంగళూరు హైవే విస్తరణతో పారిశ్రామిక ప్రగతికి రెక్కలొస్తాయి. రెండు, మూడేళ్లలో జిల్లాలో రవాణా అనుసంధానం పెరిగి పారిశ్రామిక కారిడార్‌గా అవతరించనుంది. ఉపాధి కల్పన జిల్లాగా మారబోతోంది. అన్ని నియోజకవర్గాల్లో అనువైన భూములున్న నేపథ్యంలో టెస్లా పరిశ్రమ ఉమ్మడి అనంతలో ఏర్పాటుకు ఆసక్తి చూపితే ఏ నియోజక వర్గంలో పెడతారన్న చర్చ నడుస్తోంది.

ఎయిర్ కనెక్టివిటీ... ఎంత దూరం..?

పారిశ్రామిక, వ్యవసాయ రంగాలతోపాటు ఉపాధి అవకాశాలు అందిపుచ్చుకునే దిశగా జిల్లా దూసుకెళుతోంది. కూటమి అధికారంలోకి రావడంతో జిల్లావైపు పారిశ్రామిక దిగ్గజాలు తొంగిచూస్తున్నారు. ఈనేపథ్యంలో జిల్లాలో ఎయిర్ కనెక్టివిటీ పెంచేందుకు కూటమి ప్రభుత్వం ఇప్పటికే ప్రయత్నాలు మొదలుపెట్టింది. రాష్ట్రంలో ఉన్న ఏడు ఎయిర్‌పోర్టుల సంఖ్యను 14కి పెంచేందుకు అవకాశాలపై రెండు నెలల కిందట సీఎం చంద్రబాబు, కేంద్ర పౌరవిమానయాన మంత్రి రామ్మోహన్‌నాయుడు చర్చించారు. అందులో భాగంగా జిల్లాలో ఎయిర్ కనెక్టివిటీ పెంచేందుకు సన్నాహాలు ప్రారంభించారు. పుట్టపర్తిలో శ్రీసత్యసాయి సెంట్రల్ ట్రస్టు నిర్వహిస్తున్న విమానాశ్రయాన్ని పబ్లిక్ ఎయిర్‌పోర్టుగా మార్చి, పౌరవిమానాశ్రయ సేవలు ఎలా ప్రారంభించాలన్న దానిపై చర్యలు మొదలెట్టారు. ఇప్పటికే రాష్ట్రంలో కొత్త విమానాశ్రయాల ఏర్పాటు, విస్తరణకు చర్యలు ప్రారంభించారు. పుట్టపర్తిలో ప్రజా విమానయాన సేవలు అమలు చేసేందుకు చర్చలు సాగుతున్నట్లు తెలుస్తోంది. జిల్లాకు పరిశ్రమలు క్యూకడుతున్న నేపథ్యంలో పౌర విమానాలు దిగే రోజులు దగ్గర్లోనే ఉన్నాయన్న వాదనలు వినిపిస్తున్నాయి.

ఉత్తమ పోలీసులకు పురస్కారాలు

అనంతపురం క్రైం, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో భాగంగా గత నెలలో ఉత్తమ సేవలు అందించిన పోలీస్ అధికారులు, సిబ్బందిని అభినందిస్తూ ఎస్పీ జగదీష్ బుధవారం ప్రశంసా పత్రాలు అందజేశారు. దొంగలను అరెస్ట్ చేసి సొత్తు రికవరీ చేయడం, కీలకమైన కేసుల్లో కఠిన శిక్షలు పడేలా చేయడం, చీటింగ్ కేసుల్లో నిందితులను అరెస్ట్ చేయడం, వివిధ అంశాలపై సమాచారం ఇవ్వడంలో కృషి చేసిన 24 మంది అధికారులు, సిబ్బందికి ప్రశంసా పత్రాలు అందజేశారు. అనంతపురం రూరల్ సీఐ శేఖర్, గుత్తి సీఐ వెంకటేశ్వర్లు, కళ్యాణదుర్గం సీఐ నీలకంఠేశ్వర్, కోర్టు మానిటరింగ్ సిస్టం సీఐ వెంకటేష్‌నాయక్, లీగల్ అడ్వైజర్ విష్ణువర్ధన్‌రెడ్డి, ఎస్ఐలు లోక్‌నాథ్‌చౌదరి(ఎస్బీ), అనంతపురం రూరల్ ఎస్ఐ రాంబాబు, 9 మంది హెడ్‌కానిస్టేబుళ్లు, ఆరుగురు కానిస్టేబుళ్లు, ఇద్దరు హోంగార్డులను ఎస్పీ అభినందించారు.

గంజాయి పట్టివేత.. ఇద్దరి అరెస్ట్


అనంతపురం క్రైం, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): స్థానిక వన్‌టౌన్ పోలీసులు బుధవారం రెండు కిలోల 30 గ్రాముల గంజాయిని పట్టుకున్నారు. టీవీ టవర్ సమీపంలో ఎన్టీఆర్ కాలనీకి చెందిన దూదేకుల శంషాద్‌వలి, టీవీ టవర్ వద్ద ఉంటున్న అబ్దుల్‌ఖాదర్ జిలాన్ గోశాల సమీపంలో గంజాయిని తీసుకెళ్తుండగా అరెస్ట్ చేశారు.

మహిళపై దుర్భాషలు.. ఏడాది జైలు శిక్ష

అనంతపురం క్రైం, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): ఓ మహిళను దుర్భాషలాడి బెదిరించిన కేసులో ఓ వ్యక్తికి ఏడాది జైలు శిక్ష పడింది. 2022 ఫిబ్రవరి 19న త్రీటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓ మహిళ ఇంట్లోకి రమేష్ అనే వ్యక్తి వెళ్లి దుర్భాషలాడి, బెదిరించాడు. ఈ ఘటనపై బాధితురాలి ఫిర్యాదు మేరకు అప్పటి సీఐ హరినాథ్ కేసు నమోదు చేశారు. బుధవారం స్పెషల్ మేజిస్ట్రేట్ కోర్టు న్యాయాధికారి శివశంకర్ ముద్దాయికి ఏడాది జైలు శిక్ష, రూ.3వేలు జరిమానా విధించారు.

ఆర్టీసీ డ్రైవర్ల నిజాయతీ

నాలుగు తులాల బంగారం అప్పగింత


సోమయ్యకు బంగారం, పత్రాల బ్యాగును అందిస్తున్న డిపో మేనేజర్ ఇనయతుల్లా

పుట్టపర్తి టౌన్, నవంబరు20(ఆంధ్రజ్యోతి): బస్సులో ప్రయాణీకుడు మరచిపోయిన బ్యాగును సంబంధీకుడికి అప్పగించి ఆర్టీసీ పుట్టపర్తి డిపోకి చెందిన డ్రైవర్లు నారాయణ, శేఖర్ నిజాయతీ చాటుకున్నారు. పుట్టపర్తి ఆర్టీసీ డిపో మేనేజర్ ఇనయతుల్లా తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నెల్లూరు నుంచి పుట్టపర్తికి ఈనెల 19న ఆర్టీసీ సూపర్ లగ్జరీ బస్సు బయల్దేరింది. అందులో నెల్లూరు జిల్లా వాకాడు మండలం కోడూరుపాళ్యానికి చెందిన సోమయ్య వచ్చాడు. నాలుగు తూలాల బంగారం, పత్రాలతో కూడిన బ్యాగును బస్సులోనే మరచిపోయి, వెళ్లిపోయాడు. పుట్టపర్తి డిపోకి చేరుకున్న డ్రైవర్లు నారాయణ, శేఖర్ బ్యాగును గమనించి, డిపో మేనేజర్ ఇనయతుల్లాకు అప్పగించారు. దీంతో డిపో మేనేజర్ వివరాలు సేకరించి, సోమయ్యకు సమాచారం అందించారు. బుధవారం పుట్టపర్తిలో బంగారంతోపాటు పత్రాలున్న బ్యాగును ఆయనకు అందించారు.

రైల్లో నుంచి పడి యువకుడి మృతి

గుత్తి, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): గుత్తి రైల్వేస్టేషన్ పరిధిలోని యార్డు వద్ద రైల్లో నుంచి జారి పడి గుర్తుతెలియని యువకుడు మృతి చెందినట్లు రైల్వే ఎస్ఐ నాగప్ప బుధవారం తెలిపారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదు. మృతుడికి 28 సంవత్సరాలు ఉంటాయని, 5.2 అడుగులు ఎత్తు, బ్లూ జీన్స్ మిక్స్ కలర్ ప్యాంట్, షర్ట్ ధరించాడన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

న్యూస్‌బాక్స్

టమోటా కిలో రూ.30

అనంతపురం రూరల్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): స్థానిక కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ. 30 తో అమ్ముడు పోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. మార్కెట్‌కు బుధవారం 750 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ. 23, కనిష్ఠ ధర రూ. 16 పలికినట్లు ఆయన తెలిపారు.

చీనీ టన్ను రూ.38 వేలు

అనంతపురం రూరల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో బుధవారం చీనీ కాయలు టన్ను గరిష్ఠంగా రూ. 38,300 పలికినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి గోవిందు తెలిపారు. కనిష్ఠంగా రూ. 14వేలు, సరాసరి రూ. 23,500తో అమ్ముడు పోయినట్లు తెలిపారు. మార్కెట్‌కు మొత్తంగా 60 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

1,051 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

బెళుగుప్ప, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జీడిపల్లి రిజర్వాయర్‌కు బుధవారం కృష్ణా జలాల ఇన్‌ఫ్లో 1051 క్యూసెక్కులు ఉన్నట్లు హంద్రీనీవా అధికారులు తెలిపారు. అలాగే ఔట్‌ఫ్లో కింద హెచ్ఎల్ఎంసీ-2కు 745 క్యూసెక్కులు వెళుతున్నట్లు చెప్పారు. ప్రస్తుతం రిజర్వాయర్‌లో 1.616 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు.

గడువు పొడిగింపు

లేపాక్షి, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): స్థానిక జవహర్ నవోదయ విద్యాలయంలో 2025-26 సంవత్సరానికిగాను 9, 11 తరగతుల్లో ప్రవేశ దరఖాస్తు గడువు పొడిగించినట్లు ప్రిన్సిపాల్ నాగరాజు బుధవారం ప్రకటనలో తెలిపారు. 2025-26 విద్యాసంవత్సర ప్రవేశానికి ఫిబ్రవరి 8న అర్హత పరీక్ష నిర్వహిస్తారన్నారు. ఫిబ్రవరి దరఖాస్తు గడువు ఈనెల 19వ తేదీతో ముగిసిందన్నారు. దానిని ఈనెల 26వ తేదీ వరకు పొడిగించారన్నారు.

సంక్షిప్తం

రోడ్లను నాణ్యంగా నిర్మించండి

అనంతపురం రూరల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): సిమెంట్ రోడ్ల నిర్మాణం నాణ్యంగా చేపట్టాలని ఎంపీడీఓ దివాకర్ సూచించారు. ఆయన బుధవారం మండలంలోని తాటిచెర్ల గ్రామంలో జరుగుతున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులను పరిశీలించారు. కార్యక్రమంలో టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి పాములరాయి రఘు, సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్ పాల్గొన్నారు.

ఓటరుతోనే ప్రజాస్వామ్యం పటిష్టం

● తసీల్దార్ మోహన్‌కుబార్



సదస్సులో మాట్లాడుతున్న తహసీల్దార్

అనంతపురం సెంట్రల్, నవంబరు 20: ప్రజాస్వామ్య మనుగడ, పటిష్టత ఓటరుపై ఆధారపడి ఉంటుందని అనంతపురం రూరల్ తహసీల్దార్ మోహన్‌కుమార్ పేర్కొన్నా రు. అనంతలక్ష్మి ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం ఓటు హక్కుపై విద్యార్థులకు అవగాహన సదస్సును నిర్వహించారు. ప్రిన్సిపాల్ రామమూర్తి అధ్యక్షతన నిర్వహించిన సదస్సుకు తహసీల్దార్‌తో పాటు ఆర్‌ఐ సందీప్ ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. ప్రతివిద్యార్థి ఓటరుగా నమోదుచేసుకుని పటిష్టమైన ప్రజాస్వామ్యాన్ని నిర్మించేలా భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు.

విద్యార్థులకు నిత్యావసరాల వితరణ

అనంతపురం కల్చరల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : కోవూర్ నగర్‌లోని ఎయిమ్ ఫర్ సేవ బాలుర ఆశ్రమానికి నిత్యసురభి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో నిత్యావసరాలు వితరణ చేశారు. బుధవారం ఆశ్రమ నిర్వాహకుడు చక్రవాణిని కలిసి ట్రస్టు చైర్‌పర్సన్ నిర్మలాముర‌ళి 17రకాల నిత్యావసర వస్తువులను అందజేశారు. అనంతరం ఆశ్రమంలో విద్యార్థులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో స్వామి సత్యదానంద, ట్రస్టు సభ్యురాలు సౌదామిని పాల్గొన్నారు.

మేధోసంపత్తిని కాపాడుకోవాలి

● సెంట్రల్ యూనివర్సిటీ వీసీ

అనంతపురం సెంట్రల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): నూతన ఆవిష్కరణలను పరిరక్షించుకోవాలంటే మేధోసంపత్తిని కాపాడుకోవాలని సెంట్రల్ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ ఎస్ఏ కోరి పేర్కొన్నారు. సెంట్రల్ యూనివర్సిటీలో బుధవారం 'మేధో సంపత్తి హక్కులపై అవగాహన' అనే అంశంపై ఒకరోజు వర్క్‌షాపు నిర్వహించారు. వర్సిటీ మేనేజ్‌మెంట్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఈ కార్యక్రమానికి వీసీ కోరి ముఖ్య వక్తగా హాజరై మాట్లాడారు. భవిష్యత్ ప్రాజెక్టుల అభివృద్ధి, పారిశ్రామికవేత్త ఆలోచనలు, చట్టపరమైన విధానాలు, వ్యూహాలు తదితర మేధోసంపత్తి హక్కుల పరిజ్ఞానంపై ఇంటలెక్చువల్ బ్యాంక్ సీఈఓ అశోక్ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కన్వీనర్లు మాలతి, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ ఫోరం కమిటీ ఎన్నిక

అనంతపురం సెంట్రల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ ఫోరం జిల్లా కమిటీని ఎన్నుకున్నట్లు ఆ ఫోరం నాయకుడు ఎల్లన్న పేర్కొన్నారు. బుధవారం ఎన్‌జీవో హోంలో సమావేశం నిర్వహించారు. అధ్యక్షుడిగా వంశీకృష్ణ, ప్రధాన కార్యదర్శిగా హనుమన్న, సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. నాయకులు రామాంజనేయులు, వీరాంజినేయులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ బోల్తా



విరిగిపోయిన ట్రాక్టర్ చక్రం

కనగానపల్లి, నవంబరు20(ఆంధ్రజ్యోతి): కూలీలతో వెళ్తన్న ఓ ట్రాక్టరు తిరగబడింది. అయితే ప్రాణాపాయం తప్పింది. ఓ ట్రాక్టరు బుధవారం మండలపరిధిలోని తూంచెర్ల గ్రామం నుంచి గుంతపల్లికి వెళ్తోంది. అందులో దాదాపు 21మంది కూలీలు ఉన్నారు. మార్గమ ధ్యంలో గుంతపల్లి సమీపంలో ట్రాక్టరు ముందరి చక్రం విరిగిపోయి బోల్తా పడి కూలీలు ఎగిరి పడ్డారు. ఈ ప్రమాదంలో ప్రమీలమ్మ, గౌసియా, అనితమ్మ తో పాటు పలువురు గాయపడ్డారు. గాయ పడ్డవారిని అనంతపురం ఆసుపత్రికి తీసుకెళ్ళి చికిత్సలందించామని గ్రామస్థులు తెలిపారు.

మన్నీలలో చిరుత సంచారం?

అనంతపురం రూరల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మన్నీల గ్రామ సమీపంలోని కాటిమిగొంది కుంటలో చిరుత సంచారం గ్రామస్థుల్లో కలకలం రేపుతోంది. గ్రామానికి చెందిన ఈశ్వర్ బుధవారం ఉదయం కాటిమిగొందికుంటలోని బీఎస్సీ కంకర్ క్వారీలో పని నిమిత్తం బయలుదేరాడు. దారిలో చిరుత కనిపించడంతో అతడు అక్కడి నుంచి గ్రామ వైపు తిరిగి వచ్చేసినట్లు గ్రామస్థులు చెబుతున్నారు. గ్రామస్థులు విషయాన్ని రెవెన్యూ అధికారుల ద్వారా అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. ఆ ప్రాంతాన్ని అటవి శాఖ బీట్ ఆఫీసర్ మారెప్ప పరిశీలించారు. యువకుడితో చిరుత పులి గురించి ఆరా తీశారు. రాత్రికి రెక్కీ నిర్వహిస్తామని గ్రామస్థులకు తెలిపారు. కాగా కుంటలో చిరుత సంచారం విషయం తెలుసుకున్న గ్రామస్థులు భయాందోళనకు గురవుతున్నారు. అటవి శాఖ అధికారులు చిరుత పులిని పట్టుకొని బంధించాలని కోరుతున్నారు.

సిగ్నల్స్ అందవు

● నరసనాయనికుంటలో మోగని సెల్‌ఫోన్లు
● ఇబ్బంది పడుతున్న గ్రామస్థులు
● సెల్ టవర్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి

అనంతపురం రూరల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): సాంకేతిక పరిజ్ఞానం బాగా పెరిగి పోయింది. కూర్చున్న చోటు నుంచే ప్రపంచాన్ని సందర్శిస్తున్నాము. ఇటువంటి పరిస్థితుల్లోనూ అనంతపురంరూరల్ మండలంలోని నరసనాయనికుంట గ్రామస్థులు సెల్‌ఫోన్ నెట్‌వర్క్ సరిగి పనిచేయక చాల అవస్థలు పడుతున్నారు. గ్రామం ఏర్పాటై ఇప్పటి వందేళ్లకు పైగానే కావస్తోంది. గ్రామ స్థాయి నుంచి పంచాయతీ స్థాయికి చేరింది. గ్రామంలో ఓసీ, బీసీ, ఎస్టీ, ఎస్సీ కాలనీ లున్నాయి. దాదాపు 550 కుటుంబాలు ఉండగా, రెండు వేలకు పైగా జనాభా ఉంది. పైగా ఆ గ్రామం జిల్లా కేంద్రానికి కూత



నరసనాయనికుంట గ్రామం

వేటు దూరంలో ఉంది. అయినప్పటికీ గ్రామస్థులు సెలఫోన్ సిగ్నల్ సమస్యతో ఇబ్బంది పడుతున్నారు. ఏ నెట్‌వర్క్ టవర్ గానీ సమీపంలో లేకపోవడంతో గ్రామంలో సిగ్నల్స్ ఏమాత్రం అందడంలేదని గ్రామస్థులు వాపోతున్నారు. ఎవరితోనైనా మాట్లాడాలన్నా, వాట్సప్‌లో ఏదైనా సమాచారం చేరవే యాలన్నా తప్పక మిద్దె ఎక్కాలంటున్నారు. మిద్దె ఎక్కినా ఒక్కో సారి ప్రయోజనం ఉండదం టున్నారు. ఎవరితోనైనా అత్యవసరంగా మాట్లాడాలంటే గ్రామం నుంచి దాదాపు కిలో మీటరు పైగా వెళ్లాల్సి వస్తోందని వాపోతున్నారు. రాత్రి వేళల్లో మరింతగా ఇబ్బందులు పడాల్సి వస్తోందని, ప్రాణాల మీదకొచ్చిన సందర్భాల్లో తమ అవస్థలు చెప్పుకో కూడదంటున్నారు. అంబులెన్సు సమాచారం ఇచ్చేందుకూ వీలులేని పరిస్థితులు నెలకొన్నట్లు చెబుతున్నారు.

ఇంట్లో ఉంటే ఫోన్ పనిచేయదు



ఇప్పుడున్న పరిస్థితుల్లో సెల్ ఫోన్ ఎంత అవసరమో అందరికీ తెలి సిందే. సిగ్నల్స్ సరిగా పనిచేయక పోతే పడే ఇబ్బందులు అన్నీఇన్నీ కాదు. గ్రామంలో ఇళ్లలో ఉంటే మా ఫోన్‌లన్నీ పక్కన పడేయాల్సిందే. ఏమాత్రం సిగ్నల్స్ పనిచేయవు. అత్యవసరంగా ఎవరితోనైనా మాట్లాడలంటే అప్పుడు మా అవస్థలు చెప్పుకోకూడదు. గ్రామస్థుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని సెల్ టవర్ ఏర్పాటు చేస్తే బాగుంటుంది.

\- అనిల్, నరసనాయనికుంట

కిలో మీటరు దూరం వెళ్లాల్సిందే...



నగరానికి దగ్గరలో ఉన్నాం అనేది తప్ప.... గ్రామంలో సెల్‌ఫోన్‌లు పనిచేయడం లేదు. సిగ్నల్ సమస్యతో కొన్నేళ్లుగా ఇబ్బందులు పడుతూనే ఉన్నాం. ఎవ్వరితోనైనా మాట్లాడాలంటే మిద్దెలు ఎక్కాలి. అక్కడికి కూడా సిగ్నల్స్ సరిగా లేకపోవడంతో అవతలి వారి మాటలు మాకు..మా మాటలు వారికి సరిగా వినపడవు. సిగ్నల్స్ బాగా అందాలంటే గ్రామం నుంచి కిలో మీటరు దూరం వెళ్లి మాట్లాడాల్సి వస్తోంది. ఈ ఇబ్బందులు పడలేక, ఎలాంటి పనులు లేకపోయినా ఉదయం నుంచి సాయంత్రం వరకు నగరంలో ఉండి వస్తున్నాం.

\- తిరుపాలు, ఎస్సీ కాలనీ, నరసనాయనికుంట

ఎన్ని అర్జీలు ఇచ్చినా అంతే...



గ్రామంలో సెల్ టవర్ ఏర్పాటు చేయాలని చాల సార్లు అర్జీలు ఇచ్చాం. ఇంత వరకు ఎవరూ పట్టించుకోలేదు. సమీప గొట్కూరులో సెల్ టవర్ ఉన్నప్పుడు కొంత ఉపయోగం ఉండేది. ప్రస్తుతం అక్కడ కూడా లేదని తెలిసింది. దీంతో నిత్యం ఇబ్బందులు పడుతున్నాం. టవర్ ఏర్పాటుకు గ్రామంలో స్థలం ఉంది. అయినా ఎవరూ స్పందించడం లేదు. ఇప్పటికైనా మాఇబ్బందులు దృష్టిలో పెట్టుకుని టవర్ ఏర్పాటు చేయాలి.

\- రవీంద్ర, నరసనాయనికుంట

స్పీకర్‌ను కలిసిన ఎమ్మెల్యే పరిటాల సునీత



స్పీకర్‌తో మాట్లాడుతున్న పరిటాల సునీత, శ్రీరామ్

అనంతపురంఅర్బన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఏపీ అసెంబ్లీ స్పీకర్ అయ్య న్న పాత్రుడును ఎమ్మెల్యే పరిటాల సునీత, టీడీపీ ధర్మవరం నియోజకవర్గం ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్‌లు మర్యాద పూర్వకంగా కలిశారు. బుధవారం శాసన సభలోని ఆయన కార్యాలయంలో వారు కలిసి పలు అంశాలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు.

సీఎంకు టీడీపీ జిల్లా అధ్యక్షుడి కృతజ్ఞతలు



వెంకటశివుడు యాదవ్‌తో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు

అనంతపురం అర్బన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర బడ్జెట్‌లో జిల్లా అబివృద్ధికి, సాగునీటి ప్రాజెక్టులకు విరివిగా నిధులు కేటాయించినందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. బుధవారం అసెంబ్లీలోని సీఎం చాంబర్‌లో సీఎం చంద్రబాబును వెంకటశివుడు యాదవ్ కలిశారు. అన్ని వర్గాల సంక్షేమం, అభివృద్ధికి తొలి బడ్జెట్‌లో నిధులు కేటాయింపులో అత్యధిక ప్రాధాన్యమిచ్చినందుకు జిల్లా ప్రజల తరపున కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలో రాజకీయ పరిస్థితులు, ఇతర పలు అంశాలపై చంద్రబాబు ఆరా తీసినట్లు సమాచారం.

అసెంబ్లీలో పరిటాల సునీత చర్చపై హర్షం

రామగిరి, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని అప్పర్‌పెన్నార్ ప్రాజెక్టు పనులు తిరిగి ప్రారంభించాలని ఎమ్మెల్యే పరిటాల సునీత అసెంబ్లీలో మాట్లాడంపై టీడీపీ నా యకులు, ప్రాజెక్టు రైతులు హర్షం వ్యక్తం చేశారు. పేరూరు అప్పర్ పెన్నార్ ప్రాజెక్టు వద్ద బుధవారం విలేకరుల సమావేశం ఏర్పాటుచేసి మాట్లాడారు. అప్పర్‌పెన్నార్ ప్రాజెక్టు గురించి ఎమ్మెల్యే మంగళవారం అసెంబ్లీలో మాట్లాడుతూ... గత వైసీపీ ప్రభుత్వంలో ఆగి పోయిన పనులను వెంటనే చేపట్టాలని, కాలువ కోసం భూములు ఇచ్చిన రైతులకు ఇప్పు దున్న ధరల ప్రకారం పరిహారం ఇవ్వాలని కోరడం పట్ల రైతులు హర్షం వ్యక్తంచేశారు. టీడీపీ మండల కన్వీనర్ సుధాకర్, మాజీ ఎంపీపీ పరంధామయాదవ్, నాయకులు చిత్తరంజన్, వడ్డిసుబ్బు తదితరులు పాల్గొన్నారు.

ప్లాంట్ కార్మికులకు టీఏ పెంచాలి

అనంతపురం విద్య, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): ముద్దలాపురం ఫిల్టరేషన్ ప్లాంట్ కార్మికులకు టీఏ పెంచాలని ఏఐటీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. ఇఫ్టూ(ఐఎఫ్‌టీయూ) నుంచి పలువురు కార్మికులు బుధవారం ఏఐటీయూసీలో చేశారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధానకార్యదర్శి రాజారెడ్డి, ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేష్ గౌడ్, ఇతర నాయకులు వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా రాజారెడ్డి మాట్లాడుతూ... మున్సిపల్ కార్మికులకు వెంటనే వారికి చెల్లించే ట్రావెలింగ్ అలవెన్స్ పెంచాలని కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కృష్ణుడు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు చిరంజీవి, ఇతర నేతలు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్, జేసీని కలిసిన టీసీ వరుణ్

అనంతపురం ప్రెస్‌క్లబ్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): కలెక్టర్ వినోద్‌కుమార్, జేసీ శివనారాయణశర్మను అహుడా చైర్మన్ టీసీ వరుణ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన బుధవారం జనసేన పార్టీ నాయకులతో కలిసి కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను ఆ చాంబర్‌లో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి సత్కరించారు. అనంతరం జేసీని ఆయన ఛాంబర్‌లో కలిసి సన్మానించారు. అహుడా అభివృద్ధిపై చర్చించారు. టీసీ వరుణ్‌కు అధికారులు శుభాకాంక్షలు తెలిపినట్లు జనసేన నాయకులు తెలిపారు. నాయకులు పొదిలి బాబురావు, అంకె ఈశ్వరయ్య, ఇండ్ల కిరణ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

పది సిలబస్ పూర్తయ్యాకే 'అనంత సంకల్పం': ఫ్యాప్టో




ఏడీకి వినతి పత్రం ఇస్తున్న నాయకులు

అనంతపురం విద్య, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని చాలా పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులకు సిలబస్ పూర్తికాలేదని, సిలబస్ పూర్తయిన తర్వాతే అనంత సంకల్పం అమలు చేయాలని ఫ్యాప్టో నాయకులు కోరారు. వారు బుధవారం డీఈఓను కలిసేందుకు కార్యాలయానికి వెళ్లగా ఆయన అందుబాటులో లేకపోవడంతో ఏడీ క్రిష్ణయ్యను కలిసి విన్నవించారు. కార్యక్రమంలో ఫ్యాప్టో జిల్లా చైర్మన్ సిరాజుద్దీన్, కో చైర్మన్ పురుషోత్తం, ప్రధానకార్యదర్శి లింగమూర్తి, డిప్యూటీ సెక్రెటరీ రమణారెడ్డి, శ్రీనివాసరెడ్డి, లింగమయ్య, శివ శంకర్, రామాంజినేయులు, రామకృష్ణ, గంగాధర్, సుహైల్, మన్సూర్ తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి నిధులివ్వండి

● ముఖ్యమంత్రికి ఎమ్మెల్యే శ్రావణిశ్రీ వినతి



సీఎంకు వినతి పత్రం ఇస్తున్న ఎమ్మెల్యే

శింగనమల, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గం అభివృద్ధికి నిధులు మంజూరు చేసి ఆదుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ వినతి పత్రం అందజేశారు. బుధవారం విజయవాడలో ముఖ్యమంత్రి చంద్రబాబును ఎమ్మెల్యే కలసి నియోజకవర్గంలోని ముఖ్యమైన సమస్యలపై వివరించారు. నియోజకవర్గంలోని గండికోట నుంచి పుట్లూరు వయా సుబ్బరాయ సాగర్ ఎత్తుపోతల పథకానికి ఫైనాన్స్ క్లియరెన్స్ లభిస్తే దాదాపు 35వేల ఎకరాలు సాగులోనికి వస్తుందని తెలిపారు. శింగనమల మండలంలోని రాచేపల్లి సమీపంలో ఉన్న లెదర్ ఫ్యాక్టరీని పునఃప్రారంభిస్తే దాదాపు 3000 మంది ఎస్సీ కుటుంబాలకు ఉపాధి లభిస్తుందన్నారు. అదే మండలంలోని 2003 సంవత్సరం నీటి ముంపునకు గురైన ఉల్లికల్లు, ఉల్లికంటిపల్లి ప్రజలను ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ కింద ఆర్థికంగా ఆదుకోవాలని కోరారు. బుక్కరాయసముద్రం, నార్పల, గార్లదిన్నెను కరువు మండలాలుగా ప్రకటించిన నేపథ్యంలో ఆ రైతులను ఆదుకోవాలని, ఎస్సీ నియోజకవర్గానికి ఎక్కువ నిధులు మజురు చేయాలని ఎమ్మెల్యే ముఖ్యమంత్రికి వినతి పత్రం అందజేశారు. దీనిపై ముఖ్యమంత్రి సానూకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

పంచాయతీ కార్యదర్శుల సమస్యలను పరిష్కరించాలి

● సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు శంకర్

అనంతపురం న్యూటౌన్, నవంబరు20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పంచాయతీ కార్యదర్శులు ఎదర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని పంచాయతీ కార్యదర్శుల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు శంకర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటనలో కోరారు. సచివాలయాల్లో గానీ, పంచాయతీల్లోగానీ కార్యదర్శి పూర్తి స్థాయిలో పనులు చేయలేని పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. స్వర్ణపంచాయతీ సర్వే, జీపీడీపీ తదితర ఆన్‌లైన్ పనులు చేయడానికి సచివాలయ సిబ్బంది సహకారం అందించడం లేదన్నారు. అలాగే పనిభారం వల్ల ప్రభుత్వం అప్పగించే ఏ సర్వేను పూర్తి స్థాయిలో చేయలేని పరిస్థితి నెలకొందన్నారు. ఉన్నతాధికారులు స్పందించి పంచాయతీ కార్యదర్శుల సమస్యలను పరిగణలోకి తీసుకొని తగిన న్యాయం చేయాలని కోరారు.

ఓపీల్లో సీనియర్ డాక్టర్లే ఉండాలి

● స్పెషల్ చీఫ్ సెక్రటరీ కృష్ణబాబు ఆదేశం

అనంతపురం టౌన్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాసుపత్రిలోని ఓపీలలో సీనియర్ డాక్టర్లు తప్పనిసరిగా ఉంటూ వైద్యసేవలు అందించాలని స్పెషల్ చీఫ్ సెక్రెటరీ, హెల్త్ డైరెక్టర్ కృష్ణబాబు ఆదేశించారు. ఆయన బుధవారం జిల్లా ఆస్పత్రి వైద్యాధికారులు, హెచ్‌ఓడీలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లా ఆస్పత్రులు ఆదర్శంగా పనిచేయాలన్నారు. చికిత్స కోసం వచ్చే ప్రతి రోగికి అవసరమైన వైద్యం సకాలంలో అందాలన్నారు. ఓపీ కేంద్రాలలో జూనియర్ డాక్టర్లను పెట్టి సీనియర్లు ఉండడం లేదన్న ఆరోపణలు ఉన్నాయని, ఇదిమంచిది కాదని సూచించారు.

రెస్టారెంట్‌పై దాడులు

అనంతపురం ప్రెస్‌క్లబ్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి) : నగరంలోని సప్తగిరి సర్కిల్‌లో ఉన్న మోహ్ఫిల్ అరబిక్ రెస్టారెంట్‌పై అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న, ఆహార భద్రతశాఖ, మున్సిపల్ అధికారులు బుధవారం దాడులు నిర్వహించారు. హోటల్‌లో అపరిశుభ్రతపై అసహనం వ్యక్తం చేస్తూ నోటీసులు జారీ చేశారు. అక్కడే తందూరి చికెన్‌ను పరిశీలించి శాంపిల్స్‌ను సేకరించారు. అదే విధంగా రైతుబజారు సమీపంలోని చికెన్ సెంటర్లు, ఫ్రైడ్ రైస్ సెంటర్లను తనిఖీ చేశారు. కల్తీ వంటనూనె, పలుమార్లు వాడిన నూనె వినియోగిస్తుండటంతో దానిని పారబోశారు.

నడి రోడ్డుపై ఆగిపోయిన ఆర్టీసీ బస్సు



నడిరోడ్డుపై ఆగిపోయిన బస్సు ఇదే...

అనంతపురం కల్చరల్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): ధర్మవరం డిపో ఆర్టీసీ బస్సు నగరంలో నడిరోడ్డుపై మొరాయించింది. ధర్మవరం నుంచి పాత కృష్ణ థియేటర్ సమీపంలోకి రాగానే బ్యాటరీ డౌన్ కావడంతో బస్సు ఆగిపోయింది. దీంతో ప్రయాణికులను వెనుక వచ్చిన మరో బస్సులో ఎక్కించి బస్టాండుకు చేర్చారు. ఇంజిన్ స్టార్ట్ కాకపోవడంతో డ్రైవర్, కండక్టర్ బస్సును రోడ్డుపక్కనే దాదాపు గంటపాటు వదిలేసి వెళ్లిపోయారు. ఆ తర్వాత డ్రైవర్, కండక్టర్ మరో బస్సును అక్కడికి తీసుకువచ్చి ఆ బస్సు బ్యాటరీ సాయంతో ఆగిపోయిన బస్సును స్టార్ట్ చేయించుకుని తీసుకువెళ్లారు.

మహాధర్నాను విజయవంతం చేయండి: సీఐటీయూ

అనంతపురం కల్చరల్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి) : ప్రజల, రైతాంగ సమస్యల పరిష్కారం కోసం ఈనెల 26న కలెక్టరేట్ ఎదుట చేపట్టే మహాధర్నాను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్ర కుమార్ పిలుపునిచ్చారు. మహాధర్నాను విజయవంతం చేయాలని కోరుతూ బుధవారం మున్సిపల్ కార్యాలయం నుంచి జీపు జాతాను ప్రారంభించారు. ఈసందర్భంగా నాగేంద్రకుమార్ మాట్లాడుతూ... ప్రజలు, రైతులు సమస్యలతోపాటు పలు డిమాండ్ల పరిష్కారం కోసం ఈనెల 26న కలెక్టరేట్ కార్యాలయం ఎదుట చేపట్టే మహాధర్నాలో జిల్లా నలుమూలల నుంచి ప్రజలు, రైతులు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. అనంతరం మున్సిపల్ కార్యాలయం నుంచి ప్రారంభించిన జీపుజాతా రాప్తాడు, ఆత్మకూరు, కల్యాణదుర్గం, రాయదుర్గం, కణేకల్లు, ఉరవకొండ, వజ్రకరూరు మీదుగా రాత్రికి గుంతకల్లుకు చేరింది. గురువారం ఉదయం గుంతకల్లు నుంచి బయలుదేరి గుత్తి, పామిడి, పెద్దవడు గూరు, యాడికి, తాడిపత్రి, పుట్లూరు, నార్పల, సింగనమల మీదుగా సాయంత్రం 6 గంటలకు బుక్కరాయసముద్రం చేరుకుని జీపుజాతా ముగియనుంది. ఏపీ రైతుసంఘం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, సీఐటీయూ నగర కార్యదర్శులు వెంకట నారాయణ, ముత్తుజా, మున్సిపల్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

2నుంచి పారా సిట్టింగ్ వాలీబాల్ పోటీలు

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఏపీ పారా సిట్టింగ్ వాలీబాల్ సంఘం ఆధ్వర్యంలో డిసెం బరు 2, 3వ తేదీల్లో రాష్ట్రస్థాయి పారా సిట్టింగ్ వాలీబాల్ పోటీలు నిర్వహిస్తు న్నట్లు ఆ సంఘం జిల్లా కార్యదర్శి రోసి రెడ్డి తెలిపారు. తూర్పు గోదావరి జిల్లా పాయకరావుపేటలో జరిగే ఈ పోటీల కు ఉమ్మడి అనంతపురం జిల్లాకు చెం దిన పారా సిట్టింగ్ వాలీబాల్ క్రీడాకా రులు అర్హులన్నారు. పేర్ల నమోదు, మ రిన్ని వివరాలకు సెల్ ఫోన్ నంబర్లు 9703400870, 6305354511ను సంప్రదించాలని కోరారు.

న్యాయ అవగాహన సదస్సు



మాట్లాడుతున్న న్యాయాధికారి శివప్రసాద్

అనంతపురం రూరల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ బాల దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని పంగల్ రోడ్డులో ఉన్న ఆర్డీటీ స్కూల్‌లో బుధవారం పిల్లలకు న్యాయ అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి శివప్రసాద్ హాజరై మాట్లాడారు. బాలలకు సంబంధించిన హక్కులు, బాధ్యతలను వివరించారు. ప్రస్తుత కాలంలో బాలలు ఎదుర్కొంటున్న సామాజిక సమస్యలకు సరళమైన పద్ధతిలో పరిష్కార మార్గాలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మీడియేటర్ అడ్వకేట్ పద్మజ, ఆర్డీటీ చైర్మన్ తిప్పేస్వామి, సిబ్బంది రఫీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బాలలు జాతీయ సంపద: విశాల ఫెర్రర్

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : బాలలు జాతీయ సంపద అని, వారిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిది అని ఆర్డీటీ మహిళా సాధికారత డైరెక్టర్ విశాల ఫెర్రర్ పేర్కొన్నారు. స్థానిక పంగల్‌రోడ్డులోని ఆర్డీటీ సమ్మిళిత ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ బాలల దినోత్సవాలను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా విశాల ఫెర్రర్ మాట్లాడారు. చిన్నారులకు నిర్వహించిన చిత్రలేఖనం, వ్యాసరచన, ఉపన్యాసం పోటీల విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో డీఐడీ డైరెక్టర్ రఫీక్, సీడీపీఓ శాంతలక్ష్మి, ఆర్డీటీ మహిళా విభాగం ప్రతినిధులు ఆదినారాయణ, మేనేజర్ హనుమంతు, పాఠశాల ఇన్‌చార్జి కాశీ విశ్వనాథ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

బ్యాడ్మింటన్ పోటీలు

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : అంతర్జాతీయ బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం స్థానిక అశోక్‌నగర్‌లోని డీఎస్ఏ ఇండోర్‌స్టేడియంలో షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించారు. సుమారు వందమంది క్రీడాకారులు పోటీల్లో పాల్గొన్నారు. చిన్నారులకు చదువుతో పాటు క్రీడల ప్రాముఖ్యతను తెలిపేందుకే జిల్లా క్రీడాప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించామని డీఎస్‌డీఓ ఉదయ్ భాస్కర్ తెలిపారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. డీఎస్ఏ కోచ్ నరేష్‌కుమార్ గౌడ్, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

వారసత్వ సంపదను పరిరక్షించుకుందాం

● జిల్లా పర్యాటకశాఖాధికారి జయకుమార్‌బాబు

అనంతపురం కల్చరల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని పురాతన వారత్వ సంపదను పరిరక్షించుకోవడం ప్రతిఒక్కరి బాధ్యత అని జిల్లా పర్యాటకశాఖాధికారి జయకుమార్‌బాబు పేర్కొన్నారు. జిల్లా పురావస్తు ప్రదర్శనశాలలో నిర్వహిస్తున్న ప్రపంచ వారసత్వ వారోత్సవాల-2024 కార్యక్రమంలో భాగంగా మూడోరోజు బుధవారం నిర్వహించిన కార్యక్రమానికి జిల్లా పర్యాటకశాఖ అధికారి ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. అనంతరం నగరంలోని వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులకు సీనియర్స్, జూనియర్స్ విభాగాల్లో పద్యపఠన పోటీలు నిర్వహించారు. పోటీలకు సీనియర్ కవులు ఒంటెద్దు రామలింగారెడ్డి, డాక్టర్ చిగుర్లేవు రామాంజనేయులు, కంబదూరి షేక్ నబిరసూల్, విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు సూర్యనారాయణరెడ్డి న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. విజేతలకు ఈనెల 24న నిర్వహించే ముగింపు కార్యక్రమంలో బహుమతుల ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. జిల్లా పురావస్తుశాఖ ఏడీ రజిత అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఇంటాక్ మాజీ కన్వీనర్ ఏజీ వేణుగోపాల్, రచయితలు పతికి రమేష్ నారాయణ, కసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, ఆర్ట్స్ కళాశాల లెక్చరర్లు సుధాకర్, నాగభూషణం, జానపద కళాకారుడు సాదుశేఖర్, షేక్ రియాజుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ టీచర్ల సీనియారిటీ లిస్టు సవరించాలి

● డీఈఓకు యూటీఎఫ్ నేతల వినతి

అనంతపురం విద్య, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : మున్సిపల్ ఉపాధ్యాయుల పదోన్నతుల సీనియారిటీ జాబితాను వెంటనే సవరించాలని యూటీఎఫ్ ఉమ్మడి అనంతపురం జిల్లా నాయకులు డీఈఓను కోరారు. ఆ సంఘం నాయకులు బుధవారం డీఈఓ ప్రసాద్‌బాబును ఆయన చాంబర్‌లో కలిశారు. పదోన్నతుల సీనియారిటీ జాబితాలో ఎల్ఎఫ్ఎల్ ప్రధానోపాధ్యాయుల లిస్టులో ఇప్పటికీ అనర్హుల వివరాలు ఉంచారన్నారు. జాబితాలో జరిగిన అక్రమాలను వెంటనే సవరించి, అర్హులకు అవకాశం కల్పించాలన్నారు. డీఈఓకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఆ సంఘం సత్యసాయి జిల్లా అధ్యక్షుడు జయచంద్రారెడ్డి, అనంతపురం జిల్లా గౌరవాధ్యక్షుడు రమణయ్య, జిల్లాప్రధాన కార్యదర్శి లింగమయ్య, నగర యూటీఎఫ్ నేతలు శ్రీనివాసులు, ఆదిశేషయ్య, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

స్పోర్ట్స్ మీట్‌లో కురుగుంట విద్యార్థినుల సత్తా



క్రీడాపోటీల్లో సత్తాచాటిన విద్యార్థినులతో కళాశాల ప్రిన్సిపాల్ తదితరులు

అనంతపురం రూరల్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): జోనల్ స్థాయి గేమ్స్ అండ్ స్పోర్ట్స్ మీట్‌లో మండలంలోని కురుగుంటలోని అంబేద్కర్ జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థినులు సత్తాచాటారు. వారిని బుధవారం కళాశాల ప్రిన్సిపాల్ నాగజ్యోతి, ఇతర అధ్యాపకులు అభినందించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. ఈనెల 14,15 తేదీల్లో కడప జిల్లా పులివెందులలోని అంబేద్కర్ గురుకుల కళాశాలో జోనల్ గ్రేమ్స్ అండ్ స్పోర్ట్స్ మీట్ జరిగిందన్నారు. ఇందులో కళాశాలకు చెందిన చిద్విలాస్య 100మీటర్స్ రన్నింగ్‌లో గోల్డ్ మెడల్, 20మీటర్స్ విభాగంలో బ్రాంచ్‌మెడల్ సాధించిందన్నారు. అలాగే లాంగ్ జంప్ గోల్ మెడల్ సాధించగా స్పందన షాట్ పుట్‌లో గోల్డ్ మెడల్ సాధించిందన్నారు. త్రో బాల్ విభాగంలో సౌజన్య, సిరి, జాహ్నవి, స్పందన, శిరీష, నవ్యల జట్టు విజయం సాధించి పతకం సాధించిందన్నారు. అంతేకాకుండా కళాశాలకు వ్యక్తిగత, స్పోర్ట్స్ అండ్ గ్రేమ్స్ చాంపియన్ షిప్ సాధించారన్నారు. ఈ కార్యక్రమంలో పీడీ సాయి లీలా, వైస్ ప్రిన్సిపాల్ వసుంధర తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాల అక్రమాలపై సీఐడీ విచారణ చేయించాలి

● అసెంబ్లీలో ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు

రాయదుర్గం, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ పాలనలో రాష్ట్ర వ్యాప్తంగా పేదలకు ఇళ్ల స్థలాల పేరుతో జరిగిన కుంభకోణంపై సీఐడీ విచారణ జరపాలని ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు ప్రభుత్వాన్ని కోరారు. అమరావతిలో బుధవారం ఉదయం ఏపీ అసెంబ్లీ ప్రశ్నోత్తరాల సమయంలో ఆయన ఇళ్ల స్థలాల సేకరణలో జరిగిన అవకవతలపై మాట్లాడారు. గతంలో వైసీపీ నాయకులు పేదల పేర్లు చెప్పి వేలాది కోట్లను స్వాహా చేశారన్నారు. రాయదుర్గం నియోజకవర్గంలోనే దాదాపు రూ. ఆరు కోట్ల కుంభకోణం జరిగిందన్నారు. గుమ్మఘట్ట వైసీపీ మండల కన్వీనర్ గొల్లపల్లి కాంతారెడ్డి, నాయకుడు నేత్రపల్లి భీమారెడ్డి దాదాపుగా 8 మంది రైతులతో రూ. 6 కోట్ల స్వాహా చేశారని తెలిపారు. పేద రైతుల దగ్గర నుంచి ఎకరా రూ.6 లక్షల నుంచి రూ.8 లక్షలకు భూమిని కొనుగోలు చేసి ప్రభుత్వానికి రూ.35 లక్షలు, రూ.40 లక్షల వరకు అమ్ముకున్నారని అన్నారు. రూ.1.62 కోట్లు రావాల్సిన ఒక రైతుకు కేవలం రూ.36 లక్షలు ఇచ్చి దారుణంగా మోసం చేశారన్నారు. మరో రైతుకు రూ.1.52 కోట్లు రావాల్సి ఉంటే రూ.50 లక్షలు మాత్రమే ఇచ్చారని కాలవ స్పష్టం చేశారు. పేద రైతుల భూములను అడ్డుపెట్టుకొని కోట్లాది రూపాయలు స్వాహా చేసిన వైసీపీ నాయకులపై కూటమి ప్రభుత్వం కఠినచర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

కాలువ కోసం భూసేకరణ చేయండి: ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం

గుంతకల్లు: హంద్రీనీవా ద్వారా రాగులపాడు వద్ద నుంచి గుంతకల్లు మండలంలోని 12 చెరువులకు నీరందించడానికి కాలువ నిర్మాణానికి భూసేకరణ చేయాలని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం అసెంబ్లీలో తన వాణిని వినిపించారు. అసెంబ్లీ సమావేశాల్లో బుధవారం జయరాం మాట్లాడారు. 2017లో చంద్రబాబు అనంతపురం జిల్లా పర్యటన సందర్భంగా రాగులపాడు వద్ద నుంచి హంద్రీనీవా గ్రావిటీ ద్వారా 12 చెరువులకు నీరివ్వడానికి గాను కాలువ తవ్వడానికి హామీ ఇచ్చి డీపీఆర్‌ను కూడా సిద్ధం చేశారన్నారు. కనుక ఆ హామీని నెరవేర్చాలని, హంద్రీనీవా ద్వారా పాతకొత్తచెరువు, వైటీ చెరువులకు నీరు చేరుతోందని, గుత్తి చెరువుకు నీరు చేరాలంటే కాలువను సిద్ధం చేయాల్సి ఉందని అన్నారు. గుత్తిలో తాగునీటి ఎద్దడి నివారణకు కృషిచేస్తానంటూ చంద్రబాబు ఎన్నికల హామీ కూడా ఇచ్చారన్నారు. సాగు, తాగునీటి విషయంగా ప్రభుత్వం సానుకూలంగా ఉన్నందున ఆ కాలువలను సిద్ధం చేయాలని ఆయన కోరారు.


అసెంబ్లీలో మాట్లాడుతున్న విప్ కాలవ, ఎమ్మెల్యే జయరాం

వన్యప్రాణుల సంరక్షణకు ప్రత్యేక చర్యలు: డీఎఫ్ఓ

రాయదుర్గం రూరల్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): వన్యప్రాణుల సంరక్షణ కోసం ప్రత్యేకచర్యలు తీసుకుంటామని జిల్లా అటవీ అధికారి విఘ్నేష్ అప్పోవ్ తెలిపారు. పట్టణ సమీపంలో ఉన్న నగరవనంలో జరుగుతున్న పార్క్ అభివృద్ధి పనులను బుధవారం ఆయన పరిశీలించారు. అనంతరం బొందనకల్లు అటవీ ప్రాంతాన్ని కూడా పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వన్యప్రాణుల సంరక్షణ కోసం ప్రత్యేకచర్యలు తీసుకుంటామన్నారు. అవి జనవాసంలోకి రాకుండా అవసరమైన నీటిని ఆహారాన్ని ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. అటవీ ప్రాంతంలో వర్షపునీరు వృథా కాకుండా కందకాలు ఏర్పాటు చేస్తామన్నారు. వన్యప్రాణుల ఆహారం కోసం విరివిగా పండ్ల మొక్కలను పెంచుతామన్నారు. కార్యక్రమంలో ఎఫ్ఆర్ఓ మధుబాబు, డీఆర్వో దామోదర్ రెడ్డి, అటవీ సిబ్బంది పాల్గొన్నారు.


నగరవనాన్ని సందర్శిస్తున్న డీఎఫ్ఓ

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తనిఖీ

కుందుర్పి, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డీఎంహెచ్ఓ ఈబీ దేవి, ఎన్‌సీడీ సెల్ జిల్లా ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ నారాయణ స్వామి బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అక్కడి పలు రికార్డులను, ఆస్పత్రి గదులను పరిశీలించారు. అలాగే ఆరోగ్య కేంద్రంలో రోగులకు అందుతున్న సేవలపై వైద్యాధికారి అనూష దేవిని అడిగి తెలుసుకున్నారు. తర్వాత మండలంలోని ఎనుములదొడ్డి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసి అక్కడి వైద్యులతో మాట్లాడారు. ఇక్కడి ఆస్పత్రికి సొంతభవనాలు లేకపోవడంతో వాటి నిర్మాణానికి అవసరమైన చర్యలు చేపడతామని తెలిపారు. అనంతరం అపిలేపల్లి గ్రామంలో జరుగుతున్న టీకాల కార్యక్రమాన్ని, మండలపల్లి గ్రామంలో సంచార వైద్య కేంద్రాన్ని, క్యాన్సర్ స్ర్కీనింగ్ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఆమె వెంట పలువురు వైద్యులు, సిబ్బంది ఉన్నారు.


కుందుర్పి పీహెచ్‌సీని పరిశీలిస్తున్న డీఎంహెచ్ఓ

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి

ఆంధ్రజ్యోతి, న్యూస్‌నెట్‌వర్క్: విద్యార్థులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయాల అధికారులు సూచించారు. 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకుని యాడికి, బొమ్మనహాళ్, విడపనకల్లు, పామిడి, శెట్టూరు మండలకేంద్రాలతో పాటు గుంతకల్లు పట్టణంలోని గ్రంథాలయాల్లో బుధవారం విద్యార్థులకు డ్రాయింగ్, వ్యాచరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో గ్రంథాలయాల అధికారులు మాట్లాడుతూ.. గ్రంథాలయాల్లో విద్యార్థులకు అవసరమైన అన్ని పుస్తకాలు అందుబాటులో ఉన్నాయన్నారు. కనుక ప్రతిఒక్కరూ పుస్తక పఠనం అలవాటు చేసుకుని విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. అనంతరం పోటీలు జరిపి ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఎంఈఓలు, సర్పంచ్‌లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

సాగునీటి సంఘాల ఎన్నికలపై శిక్షణ

కుందుర్పి/బ్రహ్మసముద్రం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): కుందుర్పి మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో సాగునీటి సంఘాల ఎన్నికలపై బుధవారం తహసీల్దార్ శ్రీనివాసులు పంచాయతీ కార్యదర్శులకు వీఆర్వోలకు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా సాగునీటి సంఘం ఎన్నికల విధివిధానాలను వివరించారు. మండలంలో కుందుర్పి, మలయనూరు గ్రామాలలో సాగునీటి సంఘం ఎన్నికలు జరగనున్నట్లు చెప్పారు. ఏవో శంకర్, ఎంఈఓ ఓబుళపతి పాల్గొన్నారు. అలాగే బ్రహ్మసముద్రంలోని వెలుగు కార్యాలయంలో తహసీల్దార్ సుమతి సాగునీటి సంఘాల ఎన్నికలపై పోలింగ్ అధికారులకు శిక్షణా తరగతులు నిర్వహించారు. ఎంపీడీవో నందకిషోర్, డిప్యూటీ తహసీల్దార్ శ్రీనాథ్‌రెడ్డి, ఏవో సరిత పాల్గొన్నారు.

జాయింట్ కలెక్టర్ తనిఖీ

బెళుగుప్ప, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను జిల్లా జాయింట్ కలెక్టర్ శివన్నారాయణ శర్మ బుధవారం తనిఖీ చేశారు. తహసీల్దార్ కార్యాలయంలో సిబ్బంది హాజరుపై ఆరా తీశారు. డీటీలు, ఆర్ఐలు లేకపోవడంతో వారికి మెమో ఇవ్వాలని తహసీల్దార్ షర్మిలను ఆదేశించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యసేవలపై తెలుసుకున్నారు. ఆయన వెంట ఆర్డీఓ వసంతబాబు, తహసీల్దార్ షర్మిల, వీఆర్వోలు ఉన్నారు.

పకడ్బందీగా ఇసుకరీచ్ టెండర్లు

కణేకల్లు, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని రచ్చుమర్రి గ్రామం వద్ద ఉన్న ఇసుకరీచ్‌కు టెండర్ల ప్రక్రియను పకడ్బందీగా నిర్వహిస్తున్నట్లు జాయింట్ కలెక్టర్ శివనారాయణశర్మ పేర్కొన్నారు. ఇసుక రీచ్‌ను బుధవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. రచ్చుమర్రి గ్రామ పరిధిలో దాదాపు 3.960 హెక్టార్లలో ఇసుక తవ్వకాలకు ప్రభుత్వం టెండర్ల ద్వారా ఆహ్వానిస్తోందని తెలిపారు. 59,400 మెట్రిక్ టన్నుల ఇసుక కోసం టెండర్లు జరుగుతున్నాయన్నారు. ఈ నెల 26వ తేదీలోపు అర్హత ఉన్న వారు టెండర్లు వేసుకోవచ్చని సూచించారు. ఆర్డీఓ వసంతబాబు, గనులశాఖ డీడీ వెంకటేశ్వ ర్లు, తహసీల్దార్ ఫణికుమార్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల్లో చిన్నారుల శాతం పెరగాలి

కూడేరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారుల శాతం మరింత పెంచాలని ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి సూచించారు. మండలకేంద్రంలోని 1,2,3 కేంద్రాలతో పాటు అరవకూరు, అరవకూరు బీసీ కాలనీ, బ్రహ్మణపల్లి గ్రామాల్లోని అంగన్వాడీ కేంద్రాలను బుధవారం ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అక్కడి రికార్డులు పరిశీలించారు. అనంతరం సిబ్బందితో మాట్లాడుతూ కేంద్రాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, పిల్లలకు అర్థమయ్యే విధంగా ఆట, పాటలతో బోధించాలని తెలిపారు. పీడీ వెంట సూపర్‌వైజర్ రాజమ్మ ఉన్నారు.

మాజీ ఎమ్మెల్యే జితేంద్రగౌడ్‌కు ఆహ్వానం

గుంతకల్లుటౌన్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బీరప్ప గుడి సర్కిల్లో ఈనెల 24న కనకదాస కాంస్య విగ్రహ ఆవిష్కరణకు టీడీపీ మాజీ ఎమ్మెల్యే ఆర్ జితేంద్రగౌడ్‌ను గుంతకల్లు కురుబ సంఘం నాయకులు ఆహ్వానించారు. స్థానిక క్యాంపు కార్యాలయంలో బుధవారం వారు జితేంద్రగౌడ్‌ను కలిసి ఆహ్వానించారు.

ఉపాధి పనులు ప్రారంభం

పామిడి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో బుధవారం ఉపాధి హామీ పథకం పనులను ఎంపీడీఓ తేజోత్స్న ప్రారంభించారు. మొదటగా మండల ప్రజా పరిషత్ రూఫ్ వాటర్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్‌కు భూమిపూజ చేశారు. పలువురు టీడీపీ నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కృషికి తగిన గుర్తింపు ఇచ్చారు

● వాల్మీకి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ వైపీ రమేష్

కళ్యాణదుర్గం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): టీడీపీ అభివృద్ధికి కళ్యాణదుర్గం నియోజకవర్గంలో కొన్నేళ్లుగా ఎనలేని కృషిచేశానని, ఇందుకు తనను గుర్తించి వాల్మీకి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ పదవి ఇచ్చారని వైపీ రమేష్ అన్నారు. పట్టణంలోని ప్రజా వేదిక వద్ద బుధవారం ఆయన నాయకులు, కార్యకర్తలు, అభిమానుల మధ్య భారీ కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో డబ్బులు ఇవ్వనిదే ఏ ఒక్కరికీ పదవులు, ఉద్యోగాలు వచ్చేవి కావన్నారు. కూటమి ప్రభుత్వం కష్టపడిన వారికి ప్రాధాన్యత ఇస్తోందన్నారు. కళ్యాణదుర్గం నియోజకవర్గంలో ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు అవినీతి రహిత పాలన అందిస్తూ ప్రజాభ్యుదయానికి పెద్దపీట వేస్తున్నారని కొనియాడారు. అనంతరం పలువురు పూలమాలలు, శాలువాలతో ఆయన్ను ఘనంగా సన్మానించారు. కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.


ప్రజావేదిక వద్ద కేక్ కట్ చేస్తున్న వైపీ రమేష్

యువ ఉత్సవ్‌లో విద్యార్థుల ప్రతిభ

గుంతకల్లుటౌన్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శంకరానందగిరి స్వామి డిగ్రీ కళాశాలకు చెందిన పలువురు విద్యార్థులు యువ ఉత్సవ్ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన కల్చరల్ ఫెస్టివల్, సాంస్కృతిక నృత్యవిభాగంలో ప్రతిభ కనబరిచారని ఆ కళాశాల డైరెక్టర్ గోపాల్ తెలిపారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు కళాశాలలో బుధవారం అభినందన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనంతపురంలోని జేఎన్‌టీయూ విశ్వవిద్యాలయంలో మంగళవారం నిర్వహించిన జిల్లా యువ ఉత్సవ్‌లోలో తమ కళాశాల విద్యార్థులు పాల్గొని సాంస్కృతిక, నృత్య విభాగంలో తృతీయ బహుమతి సాధించారన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు పాల్గొన్నారు.

రైతులకు రూ.10 వేలు పింఛన్ ఇవ్వాలి: సీఐటీయూ

కణేకల్లు, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): రైతులకు, వ్యవసాయ కూలీలకు ప్రభుత్వం నెలకు రూ.10 వేలు పింఛన్ ఇచ్చి ఆదుకోవాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు ఓబులు డిమాండ్ చేశారు. మండలకేంద్రంలో జీపుజాతా కార్యక్రమంలో బుధవారం ఆయన ప్రజలనుద్దేశించి మాట్లాడారు. ప్రకృతి వైపరీత్యాల వలన నష్టపోయిన రైతులకు ప్రభుత్వ భీమారంగా కంపెనీలు ఇన్సూరెన్స్‌లు ఇవ్వాలని, ఇందుకు అయ్యే ఖర్చును ప్రభుత్వమే భరించాలని కోరారు. రైతులు పండించిన పంటలకు కనీస మద్ధతు ధరను చట్టపరం చేయాలని, అంగన్‌వాడీ, ఆశా, మధ్యాహ్న భోజనం, వెలుగు, సమగ్రశిక్ష, ఉపాధిహామీ తదితర సంస్థలలో పనిచేసే వారికి కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని కోరారు. ఈ సమస్యల పరిష్కారానికి ఈనెల 26వ తేదీన కలెక్టరేట్ ఎదుట మహాధర్నా నిర్వహిస్తున్నటు పేర్కొన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ ప్రధాన కార్యదర్శి నాగేంద్ర, జిల్లా కమిటీ సభ్యులు కోరి నాగరాజు, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు చంద్రశేఖర్‌రెడ్డి, స్థానిక నాయకులు సర్మాస్, రాము తదితరులు పాల్గొన్నారు.

రాయదుర్గం రూరల్: సీఐటీయూ, ఏపీ రైతు సంఘం నాయకులు జీపుయాత్రను పట్టణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్ మాట్లాడుతూ.. రైతులు పండించిన అన్ని పంటలకు కనీస మద్ధతుధర ప్రకటించాలని కోరారు. రాష్ట్రంలో పండే అన్ని పంటలకు రుణమాఫీ చేయాలన్నారు. ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ రెడ్డి, సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి మల్లికార్జున పాల్గొన్నారు.

బుగ్గరామలింగేశ్వరుడికి వెండిగంట

తాడిపత్రి, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బుగ్గరామలింగేశ్వరస్వామి ఆలయంలో స్వామివారికి స్థానిక సంజీవ నగర్‌కు చెందిన కోమలి రవీంద్రారెడ్డి మహేశ్వరి దంపతులు 1.3కేజీల వెండిగంటను సమర్పించారు. తొలుత స్వామివారికి ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం వెండిగంటను అర్చకుడు శంకరయ్యకు అందజేశారు.


వెండిగంటను అందజేస్తున్న భక్తుడు

క్లుప్తంగా..

సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ

ఉరవకొండ, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయం వద్ద సీసీ రోడ్డు నిర్మాణానికి టీడీపీ పట్టణ కన్వీనర్ రామాంజనేయులు, నాయకుడు ప్యారం కేశవానంద బుధవారం భూమి పూజ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం కింద ఈ పనులు మంజూరైనట్లు తెలిపారు. పట్టణంలో సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.1. 90కోట్లను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. నాయకులు రామాంజనేయులు, వరప్రసాద్, గోపాల్, హరి, పెద్దన్న పాల్గొన్నారు.

లింగ వివక్షపై అవగాహన

గుంతకల్లు టౌన్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కేజీబీవీలో లింగ వివక్షతపై విద్యార్థినులకు స్థానిక అంబేడ్కర్ నగర్‌లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా హెల్త్ ఎడ్యుకేటర్ వేణుగోపాల్ మాట్లాడుతూ.. చాలామంది లింగ నిర్ధారణ పరీక్షలు చేయించుకుని ఆడశిశువు అని నిర్ధారణ అయితే భ్రూణ హత్యలకు పాల్పడుతున్నారన్నారు. ఇలాంటి వాటికి స్వస్థి పలకాలన్నారు. లింగనిర్ధారణ పరీక్షలను, బాల్య వివాహాలను ఎవరూ ప్రోత్సహించరాదని సూచించారు. కార్యక్రమంలో కేజీబీవీ ఎస్ఓ మహముదా బేగం, హెల్త్ సూపర్‌వైజర్ పద్మలత, ఏఎన్ఎం లత, టీబీ అధికారి రజాక్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

గుమ్మఘట్ట, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని 75 వీరాపురం గ్రామంలో ఓ వ్యక్తి కుటుంబ కలహాలతో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గ్రామానికి చెందిన పాలయ్య(50)కు ఇద్దరు భార్యలు. మొదటి భార్య చనిపోగా ఆమెకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. రెండో భార్య పద్మక్కతో పాలయ్య రెండురోజుల క్రితం గొడవపడ్డాడు. ఈ క్రమంలో మదన పడుతున్న అతను మంగళవారం రాత్రి తీవ్ర మనస్తాపం చెంది ఇంటి ఆవరణలో పంచెతో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికుల ద్వారా విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలిని పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

యాడికి, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): పేకాట ఆడుతున్న 10 మందిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.10600 నగదు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ ఈరన్న తెలిపారు. మండలంలోని కోనుప్పలపాడు గ్రామ సమీపంలోని కంపచెట్లలో పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందడంతో వెంటనే సిబ్బందితో కలిసి దాడిచేసినట్లు చెప్పారు. అందులో పదిమంది పేకాటరాయుళ్లను అరెస్టు చేసి, కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

అగ్నిప్రమాదంలో మహిళకు తీవ్రగాయాలు

రాయదుర్గం రూరల్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఓ మహిళ వంట చేస్తుండగా గ్యాస్‌పైప్ లీకయి మంటలు చెలరేగడంతో తీవ్ర గాయాలయ్యాయి. స్థానిక ఓబుళాచారిరోడ్డులో నివాసం ఉంటున్న వీణ అనే మహిళ రెడీమేడ్ బట్టలు కుడుతూ జీవనం సాగిస్తోంది. కాగా బుధవారం ఉదయం వంట చేస్తుండగా గ్యాస్‌పైప్ లీకై మంటలు చెలరేగడంతో తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి మంటలు ఆర్పారు. వీణను రాయదుర్గం ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్స అందించారు. మెరుగైన వైద్యం కోసం అనంతపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ఎక్స్‌కవేటర్ సీజ్

రాయదుర్గంరూరల్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని వేపరాల సమీపంలో గల వేదావతి హగరిలో అనుమతులు లేకుండా ఇసుక తవ్వకాలు నిర్వహిస్తున్న ఎక్సకవేటర్‌ను సీజ్ చేసినట్లు తహసీల్దార్ నాగరాజు తెలిపారు. ఎలాంటి అనుమతులు లేకుండా వేదావతిహగరిలో ఇసుకను తవ్వకాలు నిర్వహిస్తున్నారని సమాచారం అందడంతో బుధవారం మధ్యాహ్నం మైన్స్ అండ్ జువాలజీ అధికారులతో కలిసి దాడులు చేసి ఎక్సకవేటర్‌ను స్వాధీనం చేసుకుని మైన్స్ అండ్ జువాలజీ అధికారులకు అప్పగించామన్నారు. గనుల శాఖాధికారులు దానిని సీజ్ చేసి, పోలీస్‌స్టేషన్‌కు అప్పగించారు. బ్రిడ్జి నిర్మాణం కోసం ఇసుక తవ్వకాలను నిర్వహిస్తున్న డీఎంసీ సంస్థపై విచారణ చేపడతామని ఏడీ ఆదినారాయణ తెలిపారు.

బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి

పుట్లూరు, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): యల్లనూరు మండలంలోని దంతలపల్లి గ్రామం వద్ద విద్యుదాఘాతంలో మృతిచెందిన రామాంజనేయులు కుటుంబానికి ప్రభుత్వం రూ.50లక్షలు ఇచ్చి ఆదుకోవాలని కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు విష్ణునారాయణ బుధవారం ప్రకటనలో డిమాండ్‌చేశారు. ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే ఈ సంఘటన జరిగిందన్నారు. విద్యుదాఘాతంతో తండ్రీకొడుకులు రామాంజనేయులు, రవి మృతిచెందడం బాధాకరమన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

కణేకల్లు, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉడేగోళం గ్రామంలో బుధవారం దాడులు నిర్వహించి కర్ణాటక మద్యం విక్రయిస్తున్న ఓ వ్యక్తిని అరెస్టు చేశామని ఎక్సైజ్ సీఐ ఉమాబాయి తెలిపారు. అందిన సమాచారం మేరకు దాడులు చేశామని, అందులో మద్యం విక్రయిస్తున్న వన్నూరుస్వామిని అరెస్టు చేసి అతడి నుంచి 96 టెట్రాప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబులు ఓబులేశు పాల్గొన్నారు.

ఆలయంలో పగలే చోరీ

ఉరవకొండ, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని షిర్డీసాయిబాబా ఆలయంలో పట్టపగలే చోరీ జరిగింది. ఉదయం పూజలు నిర్వహించిన అనంతరం అర్చకుడు ఆలయానికి తలుపులు వేసి వెళ్లి పోయారు. కొద్ది సేపటికి గుర్తుతెలియని వ్యక్తి ఆలయంలోకి చొరబడి షిర్డీసాయి బాబా పంచలోహ విగ్రహాన్ని, గంటలు, శంఖాన్ని అపహరించాడు. అనంతరం అర్చకుడు వచ్చి చూసి చోరీ జరిగినట్లు గుర్తించారు. చోరి దృశ్యాలను సీసీ కెమెరాల పుటేజీల ఆధారంగా గుర్తించారు. సుమారుగా రూ.40వేలు విలువ చేసే విగ్రహాన్ని, గంటను ఎత్తు కెళ్లినట్లు అర్చకులు, కమిటీ సభ్యులు తెలిపారు. ఈ విషయంపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.


సీసీ టీవీ ఫుటేజీలో రికార్డయిన అనుమానిత వ్యక్తి

ఘనంగా మారెమ్మ ఊరేగింపు

గుమ్మఘట్ట, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని కలుగోడు గ్రామంలో బుధవారం మారెమ్మ అమ్మవారి ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. ఏటా కలుగోడు ప్రజలు వెంకటంపల్లికి వెళ్లి అక్కడికి గ్రామదేవతను తీసుకువచ్చి గ్రామంలో ఊరేగిస్తారు. ఇలా అమ్మవారిని ఊరేగిస్తే గ్రామంలో అశాంతి కలగకుండా, పశుసంపదకు రోగాలు ప్రబలకుండా, ప్రజలు ఆరోగ్యంగా, సుఖశాంతులతో ఉంటారని నమ్మకం. గ్రామస్థులు ఉదయం అమ్మవారిని తీసుకొచ్చి పురవీధుల్లో ఊరేగించారు.

డిగ్రీ కళాశాలలో మధ్యాహ్న భోజనం

గుంతకల్లు, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎస్కేపీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులకు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం మధ్యాహ్న భోజనాన్ని ఏర్పాటు చేశారు. మధ్యాహ్నం ఇళ్లకు వెళ్లలేని విద్యార్థుల కోసం భోజనాన్ని ఏర్పాటు చేయాల్సిందిగా ప్రిన్సిపాల్ లక్ష్మయ్య చేసిన విజ్ఞప్తి మేరకు ఎమ్మెల్యే చర్యలు తీసుకున్నారు. ఎమ్మెల్యే సోదరుడు గుమ్మనూరు నారాయణస్వామి కళాశాలలో బుధవారం ఉచితంగా మధ్యాహ్న భోజన కార్యక్రమాన్ని ప్రారంభించారు. మున్సిపల్ కమిషనర్ నయీం అహ్మద్, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

కాలువపల్లిలో పెద్దమ్మ విగ్రహ ప్రతిష్ఠ

బెళుగుప్ప, నవంబరు 20(ఆంధ్రజ్యోతి) : మండలంలోని కాలువపల్లిలో నూతనంగా నిర్మించిన ఆలయంలో బుధవారం గ్రామదేవత పెద్దమ్మ విగ్ర హ ప్రతిష్ఠను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. వేదపండితులు తొలుత ఆలయ ప్రాంగణంలో చండీ హోమం, పూర్ణాహుతి పూజలు చేశారు. తర్వాత ఆలయంలో అమ్మవారి విగ్రహాన్ని వేదమంత్రాల నడుమ శాస్త్రోకంగా ప్రతిష్ఠ చేశారు. భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.


పెద్దమ్మ విగ్రహం

ముగిసిన కద్లే గౌరమ్మ వేడుకలు

బొమ్మనహాళ్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని గోవిందవాడ గ్రామంలో జరుగుతున్న కద్లే గౌరమ్మ వేడుకలు బుధవారం వైభవంగా ముగిశాయి. వేకువజామున గ్రామంలోని పురవీధులలో అమ్మవారి ప్రతిమను ఊరేగించారు. యువతులు, మహిళలు కలశాలతో ఊరేగింపులో పాల్గొన్నారు. అనంతరం అమ్మవారి ప్రతిమను బావిలో నిమజ్జనం చేశారు. దీంతో వేడుకలు ముగిశాయి. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ఎస్ఐ నబీరసూల్ బందోబస్తు నిర్వహించారు.

భక్తిశ్రద్ధలతో రెండో దీపారాధన

బొమ్మనహాళ్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని దర్గాహోన్నూరు గ్రామంలో జరుగుతున్న సయ్యద్ సర్మాస్ వలి చిష్టీ ఉరుసు ఉత్సవాల్లో భాగంగా బుధవారం మూడోరోజు రెండో దీపారాధనను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారి సమాధిని దర్గా పీఠాధిపతి ముతావల్లి సయ్యద్ షా రహంతుల్లా నూతన వస్త్రం, పుష్పాలతో అలంకరించి ప్రార్థనలు, దీపారాధన చేశారు. వందలాది భక్తులు దర్గాను సందర్శించి స్వామి వారిని దర్శించుకున్నారు.

ఉపాధి పనులపై సమీక్ష

బ్రహ్మసముద్రం, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): ఉపాధిహామీ పథకంలో చేపట్టే పనులను సకాలంలో పూర్తి చేయాలని ప్రాజెక్టు డైరెక్టర్, నోడల్ అధికారి సలీమ్ బాషా సూచించారు. మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం ఆయన ఏపీడీ రమేష్ నాయక్‌తో కలిసి ఉపాధి హామీ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మండలంలోని ఆయా గ్రామాల్లో చేపట్టిన ఫారంపాండ్లు, సోపిట్లు, కమ్యూనిటీ సోపిట్లు, పశువుల షెడ్ల నిర్మాణాలను సకాలంలో పూర్తి చేయాలని తెలిపారు. హార్టికల్చర్‌లో వెనుకబడి ఉన్నారని పూర్తిస్థాయి లక్ష్యాలను చేరుకునేందుకు కృషి చేయాలని అన్నారు. ఎంపీడీవో నందకిషోర్, ఏపీవో పండరీష్, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ టీడీపీ కార్యకర్త మృతి

గుంతకల్లు టౌన్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని మొలకలపెంట గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త జయరాముడు(40) కర్నూలు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్లు కసాపురం ఎస్ఐ వెంకటస్వామి తెలిపారు. జయరాముడు అదే గ్రామానికి చెందిన వరలక్ష్మి అనే మహిళతో సన్నిహితంగా ఉండేవాడు. దీంతో అతడిని ఈనెల8వతేదీన గుంతకల్లుకు వరలక్ష్మి, అతడి కుమారుడు ఉదయ్‌కుమార్ పిలిపించి ఓ ఇంట్లో చితకబాదారు. తర్వాత మొలకలపెంట గ్రామ శివార్లలోకి తీసుకెళ్లి ఉదయ్‌కుమార్ అతని స్నేహితుడు చందు మళ్లీ చితకబాది పడేసి వెళ్లారు. గాయయపడిన జయరాముడును కుటుంబసభ్యులు గుంతకల్లు ప్రభుత్వ ఆసుపత్రికి, మెరుగైన వైద్యం కోసం బెంగళూరుకు తరలించారు. తర్వాత కర్నూలుకు తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ మృతిచెందాడు. వరలక్ష్మి, ఉదయ్‌కుమార్, చందుపై కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించామని ఎస్ఐ తెలిపారు.